తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
మంగళవారం
08 సెప్టెంబర్ 2026

## వెయ్యి రోజులు.. ఎన్నో వాగ్దానాలు .. అమలు మాత్రం శూన్యం!

- ఆటో కార్మికులకు రూ.24 వేల బకాయి.. మాట తప్పిన కాంగ్రెస్
- ఆటో కార్మికులకు రెండేళ్లుగా రూ.24 వేల బకాయి
- హామీలతో గద్దెనెక్కి.. అమలులో చేతులెత్తేశారు!
- వాగ్దానాలు వందలు.. అమలు మాత్రం సున్నా!
- మాట ఇచ్చారు.. మరిచారు.. ప్రజలను మోసం చేశారు!
- మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మ దేవేందర్‌రెడ్డి



మిగతా 12లో..

**మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 7 (జనంసాక్షి):** ఎన్నికల ముందు హామీల వర్షం కురిపించి అధికారంలోకి వచ్చిన తర్వాత మాట తప్పారని కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మ దేవేందర్‌రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. 420 హామీలు, 13 డిక్లరేషన్లు, 6 గ్యారంటీల పేరుతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. 100 రోజుల్లో హామీలన్నీ అమలు చేస్తామని చెప్పి వెయ్యి రోజులు పూర్తయినా ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు.ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ చేపట్టిన పోరుబాటలో భాగంగా పద్మ దేవేందర్‌రెడ్డి,మాజీ ఎమ్మెల్సీ శేరి.సుభాష్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు కంఠరెడ్డి. తిరుపతిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆరెళ్ల మల్లికార్జున్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లు బట్టిజగపతి, అకిరెడ్డి కృష్ణారెడ్డి, పట్టణ పార్టీ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ శ్రేణులు, ఆటో డ్రైవర్లు భారీ ఆటో, బైక్ ర్యాలీ నిర్వహించారు. మెదక్ వ్యవసాయ మార్కెట్ కమాన్ నుంచి కలెక్టరేట్ వరకు ఆటోలతో ర్యాలీ చేపట్టి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు నెలకు రూ.12 వేల జీవనభృతి ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని మరిచిపోయిందని విమర్శించారు. నిరుద్యోగ యువతను నమ్మించి మోసం చేసిందని ఆరోపించారు. ఇచ్చిన మాట ప్రకారం రూ.12 వేల జీవనభృతిని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులకు ఏటా రూ.12 వేల ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చి రెండేళ్లు గడిచినా అమలు చేయలేదని అన్నారు. దీంతో ఒక్కో ఆటో కార్మికుడికి రూ.24 వేల బకాయి పడిందని పేర్కొన్నారు. ఆటో కార్మికులకు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేసి బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు.మహాలక్ష్మి పథకం కింద ప్రతి మహిళకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం అందిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని, ఆ హామీ ఏమైందని ప్రశ్నించారు.

## ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలి: కలెక్టర్ ప్రియాంక



**నారాయణపేట జిల్లా బ్యూరో సెప్టెంబర్ 7(జనంసాక్షి):** ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి వీలైనంత త్వరగా వాటిని పరిష్కరిం చాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్ట రేట్ లోని ప్రజావాణి సమావేశ మందిరం లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 12 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి అర్జీల ను పెండింగ్ లో పెట్టకుండా సత్వరం పరిష్కరించా లన్నారు. శాఖల వారీగా ఆయా అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి వెంటనే పరిష్కరించాలన్నారు. అదనపు కలెక్టర్ శ్రీను, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో విజయ డైరీ పార్లర్ ప్రారంభం

- ప్రారంభించిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా
- మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహణ



**మహబూబ్‌నగర్, బ్యూరో సెప్టెంబర్ 7 (జనంసాక్షి):** జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విజయ డైరీ పార్లర్‌ను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సోమవారం ప్రారంభించారు.

ఇందిరా మహిళా శక్తి మహబూబ్‌నగర్ మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఈ పార్లర్‌ను నిర్వహించనున్నారు. విజయ డైరీకి సంబంధించిన వివిధ పాల ఉత్పత్తులను ఈ పార్లర్‌లో అందుబాటులో ఉంచి విక్రయించేలా చర్యలు తీసుకున్నట్లు ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్‌కు వచ్చే అధికారులు, సిబ్బంది, ప్రజలకు విజయ ఉత్పత్తులు అందుబాటులో ఉండేలా పార్లర్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, అసిస్టెంట్ కలెక్టర్ సాయి శివాని, డీఆర్డీఓ నరసింహులు, జిల్లా డైరీ శాఖ డీడీ శ్రీనివాస్, మహిళా సమాఖ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర సరిహద్దు గ్రామాలే లక్ష్యంగా..!

- వీధి కుక్కలను వదిలేసి పరారవుతున్న బీదర్ మున్సిపల్ సిబ్బంది
- గ్రామ సింహాలతో.."సరిహద్దు గ్రామాల జనం గజ గజ..!
- న్యాల్ కల్ పిహెచ్ సీ పరిధిలో 25 మంది పై వ్యక్తులపై శునకాల దాడి
- వీధి కుక్కలతో వణికిపోతున్న జనం పై"జనం సాక్షి" ప్రత్యేక కథనం..!





**న్యాల్ కల్, సెప్టెంబర్ 07, (జనం సాక్షి) :** న్యాల్‌కల్ మండల, తెలంగాణ రాష్ట్ర సరి హద్దు గ్రామాలను లక్ష్యంగా చేసుకొని వంద లాది శునకాల (వీధి కుక్కలు)ను వదిలేసి పరారవుతున్నారు. సంగారెడ్డి జిల్లా పంచా యతీ రాజ్ శాఖాధికారుల కొరవడిన పర్య వేక్షణ, మండల పంచాయతీ రాజ్ శాఖాధి కారుల నిర్లక్ష్యం కారణంగా.. గత కొంత కాలంగా.. కర్ణాటకలోని బీదర్ పట్టణానికి చెందిన వందలాది శునకాలను మండల సరిహద్దు గ్రామాలు, తెలంగాణ – కర్ణాటక రాష్ట్రాల సరిహద్దు సమీపానగల డంపు యార్డులోకి శునకాలను వదిలేయడంతో.. వందల సంఖ్యలోని వీధి కుక్కలు న్యాల్ కల్ మండలంలోని వివిధ గ్రామాల్లోకి చొరబడు తున్నాయి. మాంసం విక్రయాలు, పారవేసిన చెత్త ప్రదేశాలు, జనసంచార ప్రదేశాల వద్దకు వందల సంఖ్యలో చేరుకొని తరచుగా జనాలపై దాడులకు పాల్పడుతున్నాయి. న్యాల్‌కల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి లోని వివిధ గ్రామాల్లో ఇటీవల తాజాగా 25 మందిపై వ్యక్తులపై దాడికి పాల్పడ్డాయి. జనసంచార ప్రదేశాల్లో రేయింబవళ్లు వీధి కుక్కల స్వైర విహారం, అరుపులు, కేకలతో ప్రధానంగా చిన్నారులు, వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు గజ గజ వణికి పోతున్నారు.

మిగతా 12లో..

## ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

- ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలి: అదనపు కలెక్టర్ పాండు



**సంగారెడ్డి, సెప్టెంబర్ 7 (జనంసాక్షి):** ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదు, వినతిని క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ పాండు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో జడ్పీ సీఈవో జానకిరెడ్డి, మైనార్టీ సంక్షేమ అధికారి వెంకటేశ్వర్లుతో కలిసి ఫిర్యాదులు స్వీకరించారు. హాస్టల్ అడ్మిషన్లు, హౌసింగ్, పౌరసరఫరాలకు సంబంధించిన సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా కలెక్టరేట్, డివిజన్ కార్యాలయాల్లో 80 ఫిర్యాదులు అందగా, మండల స్థాయిలో 317 వినతులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. రెవెన్యూ, పెన్షన్లు, పంచాయతీరాజ్, విద్య, వైద్యం, వ్యవసాయం, మిషన్ భగీరథ తదితర శాఖలకు సంబంధించిన సమస్యలు అందినట్లు పేర్కొన్నారు.

## బ్రాహ్మణపల్లి రైల్వే గేట్ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జిని నిర్మించండి



**శివ్వంపేట, సెప్టెంబర్ 7(జనం సాక్షి):** బ్రాహ్మణపల్లి రైల్వే గేట్ వల్ల ఎన్నో ఏండ్లుగా నర్సాపూర్ – గజ్వేల్ నియోజకవర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బ్రాహ్మణపల్లి రైల్వే గేట్ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు విజ్ఞప్తి మేరకు భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ ముఖ్య నాయకులు సోమవారం దక్షిణ మధ్య రైల్వే, రైల్ నిలయం సికింద్రాబాద్ లో రైల్వే జనరల్ మేనేజర్ కే. కిరణ్ కుమార్ ను నేరుగా కలిసి సమస్యను వివరించి మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు ఇచ్చిన రిక్వెస్ట్ లెటర్ ను ఆయనకు అందజేయడం జరిగింది.

అనంతరం రైల్వే జనరల్ మేనేజర్ మాట్లాడుతూ త్వరలోనే ఆ ప్రదేశాన్ని పరిశీలించి, బ్రిడ్జి నిర్మాణాన్ని ప్రారంభిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతాపార్టీ జిల్లా కార్యదర్శి సాధుల్లా అశోక్, ఎరుకల భిక్షపతి, అల్లీపూర్ సర్పంచ్ చింతకాయల కుమార్, మండల ఉపాధ్యక్షులు అయ్యగారి షాదుల్లా తదితరులు ఉన్నారు.

## పాఠశాలల్లో పరిశుభ్రతపై నిర్లక్ష్యం సహించేది లేదు

- బాధ్యులపై కఠిన చర్యలు
- పరిశుభ్రత లేని పాఠశాలపై చర్యలు
- అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్
- మోడ్రన్ పాఠశాలలో ఆకస్మిక తనిఖీ
- పారిశుధ్యంపై ఆగ్రహం
- హెచ్ఎంకు షోకాజ్ నోటీసు



**మహబూబ్‌నగర్, బ్యూరో సెప్టెంబర్ 7 (జనంసాక్షి):** పాఠశాలల ఆవరణలో పరిశుభ్రత విషయంలో నిర్లక్ష్యం వహిస్తే ఎంతటి వారైనా చర్యలు తప్పవని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ హెచ్చరించారు. సోమవారం మహబూబ్ నగర్ లోని మోడ్రన్ పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి లక్ష్మణ్ సింగ్ తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణ, తరగతి గదుల పరిసరాల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడం, చెత్తాచెదారం పేరుకుపోయి ఉండటాన్ని గమనించారు. పాఠశాలలో పారిశుధ్య పరిస్థితులపై అదనపు కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత పాఠశాల యాజమాన్యంపై ఉందని స్పష్టం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన ప్రధానోపాధ్యాయుడి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ప్రధానోపాధ్యాయుడికి వెంటనే షోకాజ్ నోటీసు జారీచేయాలని ఎంఈఓను ఆదేశించారు. పాఠశాల ప్రాంగణాన్ని నిరంతరం పరిశుభ్రంగా ఉంచేలా తక్షణమే చర్యలు చేపట్టాలని సూచించారు.

విద్యార్థుల ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. నిర్లక్ష్యం వహించే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు.

# రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ...భయంతోనే అణచివేత



**కృష్ణ, సెప్టెంబర్ 7 (జనంసాక్షి):** రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా అపహాస్యం చేస్తూ, నిరంకుశ, నిర్బంధ పాలన సాగిస్తున్నారని బి జె పై ఎం మండల అధ్యక్షుడు గుడేబల్లూర్ వట్టెవోళ్ళ సురేష్ మండిపడ్డారు. విద్యార్థుల భవిష్యత్తు అగాధంలో పడిందని, ఫీజు రీయింబర్స్మెంట్ రాక విద్యా ర్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తెలియజేయా లని, ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా శాంతియుతం గా నిరసన తెలుపుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు నారాయణపేట జిల్లా అధ్యక్షుడు భరత్ ను అరెస్టు చేయడం అత్యంత దుర్మార్గపు చర్య అని తీవ్రం గా ఖండించారు. నిరసన తెలిపే రాజ్యాంగబద్ధమైన హక్కును కాలరాస్తుందని రాష్ట్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో 'చోటా హిట్లర్' పాలన కొనసాగుతుందని, ప్రజల సమస్య లపై గళమెత్తితే అణచి వేయడమే లక్ష్యంగా, రాజ్యాంగ విరుద్ధమైన పాలన సాగిస్తున్నారన్నారు.

ప్రతిపక్షాల గొంతు నొక్కడ మే పనిగా కాంగ్రెస్ ప్రభు త్వం పెట్టుకుందన్నారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్ల కోసం పోరాడు తున్న బీజేపీ నాయకులను అరెస్ట్ చేయడం వెనుక ప్రభుత్వ భయం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. అక్రమ అరెస్టులకు బీజేపీ భయప డబోదనీ అన్నారు. ప్రభు త్వం వెంటనే రామచందర్ రావు ని, అలాగే అరెస్ట్ చేసిన ఇతర నాయకులను, విద్యార్థులను బేషరతుగా విడుదల చేయాలనీ డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్మెంట్ సమస్య ను తక్షణమే పరిష్కరించ కపోతే, విద్యార్థుల పక్షాన బీజేపీ ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుంద ని ప్రభుత్వాన్ని డీకే అరుణ హెచ్చరించారు.

# అంబేద్కర్‌పై అవమానకర వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



**చేర్యాల, సెప్టెంబర్ 07 (జనంసాక్షి):** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అవమానకర వ్యాఖ్యలు చేసిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని జాతీయ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుట్టి సత్య నారాయణ డిమాండ్ చేశారు. సోమవారం చేర్యాల పోలీస్‌స్టేషన్‌లో హమారా ప్రసాద్ అలియాస్ నాగులపురం వరప్రసాద్‌పై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సోషల్ మీడియా, టీవీ ఇంటర్వ్యూల్లో అంబేద్కర్‌ను అవమానిస్తూ, రాజ్యాంగాన్ని వక్రీకరిస్తూ వ్యాఖ్యలు చేయడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమన్నారు. రాజ్యాంగ నిర్మాతను, రాజ్యాంగాన్ని అవమానించిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. బాధ్యులపై కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా ప్రచార కార్యదర్శి మేడిపల్లి నరసింహ, డివిజన్ అధ్యక్షుడు చింతల విజయ్‌కుమార్, నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీరాం వెంకటేష్, యూత్ నాయకులు, మహిళా విభాగం ప్రతినిధులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ ప్రాంగణంలో ఎమ్మెల్యేకు అవమానం

- **అవమానానికి నిరసనగా కౌడిపల్లిలో బీఆర్ఎస్ భారీ ధర్నా**



**కౌడిపల్లి, సెప్టెంబర్ 07 (జనంసాక్షి):** నర్సాపూర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వాకిటి సునీత లక్ష్మారెడ్డికి అసెంబ్లీ ప్రాంగణం వద్ద జరిగిన అవమానకర ఘటనను నిరసిస్తూ కౌడిపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు సోమవారం భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఘటనను తీవ్రంగా ఖండిస్తూ నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ప్రజా ప్రతి నిధులను అవమానించడం సరికాదని, ఇలాంటి ఘటనలు పునరా వృతం కాకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నర్సాపూర్ నియోజకవర్గ ప్రజల తరఫున ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డికి అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై పోరాడే ప్రజాప్రతినిధులకు గౌరవం ఇవ్వాలని కోరారు. నిరసనలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సారా రామగౌడ్, నాయకులు దుర్గారెడ్డి, మహిపాల్‌రెడ్డి, సర్పంచులు రవి యాదవ్, శివానందరెడ్డి, కోల శ్రీనివాస్, కుద్బుద్దిన్, యువజన అధ్యక్షుడు మంగల్పర్తి సందీప్, బాలకృష్ణ, కుమార్, గణేష్‌కుమార్, గోపాల్, రమేష్‌నాయక్, పోచయ్య, రవి, సాగర్, యాదుల్లా, మహబూబ్, సుధాకర్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# న్యాల్‌కల్ కేజీబీవీలో నైట్ వాచ్మెన్ పోస్ట్ కాళీ

- **నేటి నుండి దరఖాస్తుల ఆహ్వానం, ప్రతినెల రూ:9750 గౌరవ వేతనం**



**న్యాల్‌కల్, సెప్టెంబర్ 07, (జనంసాక్షి):** న్యాల్‌కల్‌లోని శ్రీ కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో నైట్ వాచ్మెన్ పోస్ట్ ను భర్తీ చేసేందుకు జిల్లా ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు స్థానిక ప్రత్యేకాధి కారిణి (ఎస్ ఓ) సంగీత సోమవారం ఓ ప్రకటనలో తెలి పారు. అర్హత కలిగిన మహిళలు ఈనెల 8 నుండి11లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కనీస విద్యార్హత 7వ తరగతి ఉత్తీర్ణత, 45 సంవత్సరాల్లోపు ఉన్న మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మండల తహసిల్దార్, ఎంపీడీఓ, మండల విద్యాధికారుల పర్యవేక్షణలో ఎంపిక జరగనుందని ఎస్ ఓ తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని, మరింత సమాచారం కోసం నేరుగా స్థానిక కస్తూర్బా గురుకులం కార్యాలయానికి వచ్చి సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు. స్థానిక అభ్యర్థుల (న్యాల్ కల్)కే అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు.

# కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలి



**నిజాంపేట్, సెప్టెంబర్ 7 (జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయం లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు సోమవారం నిజాంపేట్ ప్రజావాణిలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసి డెంట్ కేటీఆర్ పిలుపు, నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి 1,000 రోజులు పూర్తవుతున్నా 420 హామీల్లో అనేకం అమలు కాలేదని ఆరోపించారు. మహిళలకు రూ. 2,500 సాయం, ఉచిత స్కూటీలు, యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతు భరోసా, కల్యాణలక్ష్మి, తులం బంగారం తదితర హామీలపై ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత విద్యుత్, మిషన్ భగీరథ వంటి పథకాలు అమలు చేశామని పేర్కొన్నారు. హామీల అమలుకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వ్యక్తిపై దాడి కేసులో నిందితుడికి రిమాండ్




**వీపనగండ్ల, సెప్టెంబర్ 8 (జనంసాక్షి):** వీపనగండ్ల మండలం కల్వరాల గ్రామానికి చెందిన పోచమోని తిరుపతయ్య (43)పై దాడి చేసిన కేసులో అదే గ్రామానికి చెందిన పోచమోని రాజశేఖర్‌ను పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. స్థానిక ఎస్సై జి నరేష్ కుమార్ వివరాల ప్రకారం ఈ కేసులో రాజశేఖర్‌కు 1వ అదనపు జేఎఫ్‌సీఎం కోర్టు రిమాండ్ విధించినట్లు తెలిపారు. గత నెల 30న మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో తిరుపతయ్య తన సొంత భూమిలో వ్యవసాయ పనులు చేసుకుంటుండగా, అదే గ్రామానికి చెందిన పోచమోని రాజశేఖర్, పోచమోని లక్ష్మి బాధితుని దగ్గరకు వచ్చి దుర్భాషలాడుతూ గొడవ పడినట్లు తెలిపారు. క్రమంలో లక్ష్మి తిరుపతయ్యపై చేతులతో దాడి చేయగా, రాజశేఖర్ అక్కడే ఉన్న రాయితో దాడి చేసినట్లు ఫిర్యాదు అందినట్లు స్థానిక ఎస్సై తెలిపారు.

ఈ దాడిలో తిరుపతయ్య ఎడమ చేతికి బలమైన గాయం కాగా, కడుపు ,ముఖం, తలపై గాయాలైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బాధితులు ఫిర్యాదు మేరకు పోచమోని రాజశేఖర్‌ను అరెస్ట్ చేసి 1వ అదనపు జేఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఎస్సై నరేష్ కుమార్ తెలిపారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ పకడ్బందీగా కొనసాగుతోంది

- **1.15 లక్షల మందికి నోటీసుల జనరేషన్.. 1.13 లక్షల మందికి జారీ**



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 7 (జనంసాక్షి):** నాగర్ కర్నూల్ జిల్లాలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ ను ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పకడ్బందీగా నిర్వహిస్తున్నా మని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ తెలిపారు. సోమవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాలో ఎస్ఐఆర్ పురోగతిని వివరించారు. కలెక్టరేట్ నుంచి అచ్చంపేట సబ్‌కలెక్టర్ సలోని చాబ్రా, అదనపు కలెక్టర్ బి.చెన్నయ్య, ఆర్‌డీఓలతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు.

**32,553 మందికి హియరింగ్ పూర్తి...**

నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 1,15,824 మంది ఓటర్లకు నోటీసులు జనరేట్ చేయగా, 1,13,996 మందికి నోటీసులు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్ల నుంచి ఎన్నికల సంఘం సూచించిన 11 రకాల ధ్రువపత్రాలను స్వీకరించి పరిశీలించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నామని వివరించారు. ఇప్పటివరకు 32,553 మంది ఓటర్లకు హియరింగ్ నిర్వహించి, వారు సమర్పించిన ధ్రువపత్రాలను పరిశీ లించిన అనంతరం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు తెలిపారు.

ఎస్ఐఆర్‌లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా బూత్ స్థాయి అధికారులకు (బీఎల్‌ఓలు) పూర్తిస్థాయి శిక్షణ ఇచ్చామని కలెక్టర్ పేర్కొన్నారు. నోటీసుల జారీ నుంచి హియరింగ్, ధ్రువపత్రాల పరిశీలన, వివరాల అప్‌లోడ్ వరకు ప్రతి దశను నిబంధనల ప్రకారం నిర్వహించేలా వారికి అవగాహన కల్పించినట్లు తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహిస్తూ వారి సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటున్నామని చెప్పారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా కొనసాగేలా అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని, అర్హులైన ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రతి దరఖాస్తు, ధ్రువపత్రాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తున్నామని కలెక్టర్ తెలిపారు.

ఈ సందర్భంగా సీఈఓ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ నోటీసుల జారీ, ధ్రువపత్రాల స్వీకరణ, పరిశీలన, అప్‌లోడ్ ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా పర్యవేక్షించాలని ఆదేశించారు. 11 రకాల ధ్రువపత్రాలను పూర్తిగా పరిశీలించిన తర్వాతే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచిం చారు. డేటా నమోదు, ధ్రువపత్రాల అప్‌లోడ్‌లో పొరపాట్లు జరగకుం డా ఏఆర్‌ఓలు, ఆర్‌ఓలు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

సమావేశంలో ఆర్‌డీఓ అర్చన, కొల్లాపూర్ ఆర్‌డీఓ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రవికుమార్, ఎన్నికల డీటీ కల్పన తదితరులు పాల్గొన్నారు.

# హామీల అమలుపై బీఆర్ఎస్ గర్జన

- **6 గ్యారంటీలు.. 420 హామీలు వెంటనే అమలు చేయాలి**



**గుండుమాల్, సెప్టెంబర్ 7 (జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ అధిష్ఠానం పిలుపు మేరకు గుండుమాల్ రైతు వేదికలో హామీల అమలుపై నిరసన చేపట్టారు.

అనంతరం ప్రజావాణిలో డిప్యూటీ తహసీల్దార్ జ్యోష్ణ, ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

ప్రజలకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. హామీలను త్వరితగతిన అమలు చేసి ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మహిళా నాయకులు, విద్యార్థి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

• మండపాల నిర్వాహకులతో సమన్వయంతో పటిష్ట భద్రతా ఏర్పాట్లు



మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 7 (జనంసాక్షి): వినాయక చవితి, గణేష్ నవరాత్రి ఉత్సవాలు, విగ్రహాల నిమజ్జనం సందర్భంగా శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉత్సవాల భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి గణేష్ మండపం వద్ద భద్రతా పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులతో పోలీసులు నిరంతరం సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. నిమజ్జనం, ఊరేగింపు మార్గాలను ముందుగానే పరిశీలించి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు సిద్ధం చేయాలని సూచించారు. రద్దీ ప్రాంతాల్లో తగినంత పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. ఊరేగింపుల్లో డీజేలు, అధిక శబ్దం, రెచ్చగొట్టే నినాదాలు, మద్యం సేవించి పాల్గొనడం వంటి అంశాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని స్పష్టం చేశారు. రౌడీషీటర్ల కదలికలను పర్యవేక్షిస్తూ, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తులను ముందుగానే గుర్తించి చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు ప్రజలు, ఉత్సవ కమిటీలు పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్పీ కోరారు. పోలీస్ శాఖ సూచించిన భద్రతా నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో మెదక్ డీఎస్పీలు ప్రసన్నకుమార్, నరేందర్‌గౌడ్, సీఐలు మహేష్, కృష్ణమూర్తి, రాజశేఖర్‌రెడ్డి, జార్జ్, ఆర్ఐలు శైలేందర్, రామకృష్ణ, ఎస్ఐలు పాల్గొన్నారు.

## ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

అల్లాదుర్గం, సెప్టెంబర్ 7 (జనంసాక్షి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు సోమవారం అల్లాదుర్గంలో నిరసన చేపట్టారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించి పంచాయతీరాజ్ సబ్‌డివిజన్ కార్యాలయంలోని ప్రజావాణికి చేరుకున్నారు. ఈ సందర్భంగా క్రాంతికిరణ్ మాట్లాడుతూ హామీల అమలులో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. నియోజకవర్గంలో డూప్లికేట్ డాక్టర్ల వ్యవహారం ఆందోళనకరమని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగుల భద్రతపై ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. హామీలన్నీ అమలుచేసే వరకు ఉద్యమం కొనసాగుతుందని హెచ్చరించారు. అనంతరం ఎంపీడీవో వేదప్రకాశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేలకు జరిగిన అవమానంపై ఎస్సీ,ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు



తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ఎమ్మెల్యేల పట్ల జరిగిన అవమానకర వ్యవహారంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్యే కోవా లక్ష్మి పాల్గొని ఘటన వివరాలను కమిషన్‌కు వివరించారు. అనంతరం మాణిక్‌రావు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి దళిత ఎమ్మెల్యేలను అవమానించారని, పోలీసులతో తమపై దాడి చేయించారని ఆరోపించారు. వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ప్రయోజనం కలగలేదన్నారు. తమను అవమానించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ ప్రజాప్రతినిధుల హక్కులు, గౌరవం కోసం బీఆర్ఎస్ పోరాడుతుందని స్పష్టం చేశారు.

## బీజేపీ నేతల హౌస్ అరెస్ట్



జహీరాబాద్, సెప్టెంబర్ 7 (జనంసాక్షి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ ఇందిరాపార్క్‌లో నిర్వహించిన విద్యార్థి మహాధర్నాకు వెళ్లకుండా బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేసి చిరాగ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బీజేపీ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి నౌబాద్ జగన్నాథ్ మాట్లాడుతూ ప్రభుత్వం ఫీజు బకాయిల చెల్లింపులో నిర్లక్ష్యం చేస్తోందన్నారు. సుమారు రూ.15 వేల కోట్ల బకాయిలతో 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ఇబ్బందుల్లో పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నిరసనను అడ్డుకోవడం అప్రజాస్వామికమన్నారు. బకాయిలను వెంటనే విడుదల చేయాలని, లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అరెస్టైన వారిలో జగన్నాథ్, సురేష్, ప్రతాప్‌రెడ్డి, నరేష్, నాగేష్ తదితరులు ఉన్నారు.

## మహాధర్నాకు వెళ్లకుండా బీజేపీ నేతల హౌస్ అరెస్ట్



మొగుడంపల్లి, సెప్టెంబర్ 07 (జనంసాక్షి): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద బీజేపీ నిర్వహించిన విద్యార్థి మహాధర్నాకు వెళ్లకుండా బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేసి చిరాగ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బీజేపీ సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి నౌబాద్ జగన్నాథ్ మాట్లాడుతూ రూ.15 వేల కోట్ల బకాయిలతో సుమారు 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ఇబ్బందుల్లో పడుతోందని ఆరోపించారు. నిరసన తెలిపే హక్కును అడ్డుకోవడం అప్రజాస్వామికమన్నారు. ప్రభుత్వం బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పోరాటాలను ఉధృతం చేస్తామని తెలిపారు. అరెస్టయిన వారిలో జగన్నాథ్, సురేష్, ప్రతాప్‌రెడ్డి, నరేష్, నాగేష్ తదితరులు ఉన్నారు.

## అయ్యప్ప ఆలయ ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన

• జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్



నిజాంపేట్, నవంబర్ 8 (జనంసాక్షి): నిజాంపేట్ మండలంలోని బాచేపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో నిర్మిస్తున్న శ్రీ అయ్యప్ప స్వామి ఆలయ ప్రహరీ గోడ నిర్మాణ పనులను జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు గౌ.సురేష్ కుమార్ షెట్కర్ శుక్రవారం పరిశీలించారు. గత సంవత్సరం మంజూరైన నిధులతో కొనసాగుతున్న ప్రహరీ గోడ నిర్మాణ పనుల పురోగతిని ఎంపీ పరిశీలించి, పనుల వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఆలయ నిర్మాణానికి ఈ ఏడాది కూడా నిధులు మంజూరు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, గ్రామ పెద్దలు, చుట్టుపక్కల గ్రామాల నాయకులు, అయ్యప్ప ఆలయ సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారెంటీలు లేవు అభివృద్ధి అసలే లేదు

• మున్సిపల్ కౌన్సిలర్ జైపాల్ నాయక్



తూప్రాన్ సెప్టెంబర్ 7(జనంసాక్షి): ప్రభుత్వ నిధులు లేక అభివృద్ధి జరగడం లేదని తూప్రాన్ మున్సిపల్ నాలుగో వార్డ్ కౌన్సిలర్ జైపాల్ రాథోడ్ తెలిపారు. తూప్రాన్ మున్సిపల్ లోని స్థానిక ఆర్డిఓ కార్యాలయానికి వినతి పత్రం అందజేసిన బిఆర్ఎస్ నాయకులు పార్టీ అధినేత కేసిఆర్ ఆదేశాల మేరకు సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో మున్సిపల్ వార్డు సమస్యల పైన వినతి పత్రం అందజేశారు. మాజీ మున్సిపల్ చైర్మన్ బొంది రవీందర్ గౌడ్ మాట్లాడుతూ సన్యాసి కాంగ్రెస్ ప్రభుత్వం పాలన వేయి రోజులు పూర్తి చేసుకున్న ప్రజలకు ఇచ్చిన హామీలు ఆరు గ్యారెంటీలు 420 హామీలు గాలికి వదిలేసి పేద ప్రజలకు ఉపయోగపడని 22 ఏ జీవో తీసుకొచ్చి ప్రజలకు ఇబ్బంది కలిగేలా చేస్తుందని, రానున్న రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్తారని కెసిఆర్ చేసిన పథకాలకు ఆపేసి 420 హామీలు కూడా అమలు చేయకుండా పబ్బం గడుపుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మున్సిపల్ కౌన్సిలర్లు రాథోడ్ జైపాల్ నాయక్ చెలిమెల రాములు, సత్యలింగం ,బొడ్డు రాధా శ్రీనివాస్, బలేష్ యాదవ్, నర్సంపల్లి సర్పంచ్ భాస్కర్, నాయక్ బిఆర్ఎస్ నాయకులు కిష్టారెడ్డి, బుక్క విజయ్ మైనార్టీ నాయకులు సత్తార్ తదితరులు పాల్గొన్నారు

## స్పీకర్ పై ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు

• ఏఎంసి వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్



నంగునూరు, సెప్టెంబర్ 7(జనంసాక్షి): తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నంగునూరు మండల కాంగ్రెస్ నేతలు తీవ్రంగా ఖండించారు. మధు తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఏఎంసీ వైస్ చైర్మన్ పవన్‌కుమార్ మాట్లాడుతూ, రాజ్యాంగ బద్ధమైన స్పీకర్ పదవిలో ఉన్న వ్యక్తిపై అనుచిత భాషను ఉపయోగించడం ప్రజాస్వామ్య వ్యవస్థకే గొడ్డలిపెట్టు లాంటిదని అన్నారు. ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బహిరంగ క్షమాపణ చెప్పాలని, తాతా మధుతో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయించి ఆయన సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు ఎండీ ఇమామ్ మాట్లాడుతూ, రాజ్యాంగబద్ధ పదవుల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పదేళ్ల అధికారంలో ప్రతిపక్షాల పట్ల బీఆర్ఎస్ వ్యవహరించిన తీరును ఆ పార్టీ నేతలు ఆత్మపరిశీలన చేసుకోవాలని, ఇప్పటికైనా ప్రజాసమస్యలపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

## ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



అల్లాదుర్గం, సెప్టెంబర్ 7(జనంసాక్షి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు సోమవారం అల్లాదుర్గంలో నిరసన చేపట్టారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించి పంచాయతీరాజ్ సబ్‌డివిజన్ కార్యాలయంలోని ప్రజావాణి కార్యక్రమానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా క్రాంతికిరణ్ మాట్లాడుతూ హామీల అమలులో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. మంత్రి దామోదర రాజనర్సింహ ప్రాతినిధ్యం వహిస్తున్న అందోల్ నియోజకవర్గంలో డూప్లికేట్ డాక్టర్ల వ్యవహారం వెలుగుచూడటం ఆందోళనకరమన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగుల భద్రతపై ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీలన్నీ అమలు చేసే వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని హెచ్చరించారు. అనంతరం ఎంపీడీవో వేదప్రకాశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లెగడ్డ నర్సింలు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ దుర్గారెడ్డి, నాయకులు చెన్నకృష్ణాగౌడ్, రామాగౌడ్, కృష్ణాగౌడ్, లక్ష్మయ్య, బేతయ్య, పవన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

## కొల్లాపూర్ ర్యాలీకి తరలిన బీఆర్ఎస్ శ్రేణులు



చిన్నంబావి, సెప్టెంబర్ 7 (జనంసాక్షి): విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కొల్లాపూర్‌లో నిర్వహించిన భారీ ర్యాలీకి చిన్నంబావి నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. వెయ్యి రోజుల ప్రజాపాలనపై నిరసనగా ర్యాలీ చేపట్టినట్లు నాయకులు తెలిపారు. ఉమ్మడి మండలాల ఇన్‌చార్జ్ గోవింద్ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. విద్యారంగంలోని సమస్యలను పరిష్కరించి, విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ సమస్యలను పరిష్కరించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు రంజిత్‌కుమార్, మద్దిలేటి, సీనియర్ నాయకులు మహేశ్వర్‌రెడ్డి, స్వాములు, వడ్డేమాన్ రామకృష్ణ, యువ నాయకులు జీవీకే నాయుడు, శరత్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులే భావితరాలకు దిశానిర్దేశకులు

## విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దే మహత్తర బాధ్యత ఉపాధ్యాయులదే: కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్







**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో,సెప్టెంబర్ 7 (జనంసాక్షి):** సమాజానికి మంచి పౌరులను అందించడంలో, భావితరాల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 70 మంది జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులంటే తనకు ఎంతో గౌరవమని, తన తండ్రి కూడా ప్రభుత్వ ఉపాధ్యాయుడేనని తెలిపారు. ఉపాధ్యాయుల బాధ్యత పాఠ్యాంశాల బోధనతో ముగియదని, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి మార్గనిర్దేశం చేసి ఉన్నత లక్ష్యాల సాధనకు ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి విద్యార్థి సామర్థ్యాన్ని గుర్తించి, సృజనాత్మకతను వెలికితీసేలా పనిచేయాలన్నారు.

విద్యార్థుల్లో క్రమశిక్షణ, సమయపాలన, నైతిక విలువలు, సామాజిక బాధ్యత, మానవతా దృక్పథాన్ని పెంపొందించాలని కోరారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సవాళ్లకు అనుగుణంగా ఉపాధ్యాయులు తమ బోధనా పద్ధతులను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ సమస్య పరిష్కార సామర్థ్యం, ఆత్మవిశ్వాసాన్ని పెంచాలని అన్నారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. ఈ సన్మానం వారి సేవలకు లభించిన గౌరవానికి ప్రతీక అన్నారు. అవార్డుతో బాధ్యత మరింత పెరుగుతుందని, ఇతర ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలవాలని కోరారు. ఒక మంచి ఉపాధ్యాయుడు విద్యార్థి జీవితంతో పాటు కుటుంబం, సమాజం, తరాన్ని ప్రభావితం చేయగలడని పేర్కొన్నారు.

కార్యక్రమంలో డీఈఓ ఎ. రమేష్‌కుమార్, సెక్టోరియల్ అధికారులు, ఎంఈఓలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రధానోపాధ్యాయులు, అవార్డు గ్రహీతలు, అధికారులు పాల్గొన్నారు.

# స్పీకర్‌ను అవమానిస్తే సహించేది లేదు



**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 7(జనంసాక్షి):** తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను రాయికోడ్ ఏఎంసీ చైర్మన్ మంతూర్ సుధాకర్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులు తీవ్రంగా ఖండించారు. స్పీకర్, ఆయన కుటుంబాన్ని కించపరిచేలా మాట్లాడటం రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవిని అవమానించడం నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని పేర్కొన్నారు. రాజకీయ విమర్శలకు హద్దులు ఉండాలని, వ్యక్తిగత దూషణలకు ప్రజాస్వామ్యంలో స్థానం లేదన్నారు. తాతా మధు వెంటనే క్షమాపణ చెప్పాలని, సభా మర్యాదలు ఉల్లంఘించినందుకు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ పదవుల గౌరవాన్ని కాపాడేందుకు అవసరమైతే రాజకీయాలకు అతీతంగా పోరాడతామని సుధాకర్‌రెడ్డి హెచ్చరించారు.

# ప్రజావాణిలో బాధితులకు సత్వర న్యాయం

- ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ



**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 07(జనంసాక్షి):** ప్రజావాణిలో బాధితులకు సత్వర న్యాయం జరుగుతుందని జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్ పేర్కొన్నారు. జిల్లా ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ఎస్పీ పరితోష్ పంకజ్ ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారంపై ఆరా తీశారు. ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమస్య పరిష్కారం కాకపోతే ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సూచించారు.

# సొసైటీ అక్రమాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు



**చిన్న శంకరంపేట్, సెప్టెంబర్ 7(జనంసాక్షి):** ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ ఆఫీస్ లో కలెక్టర్ కు చందంపేట సొసైటీ అక్రమాలపై సెక్షన్ 52 ప్రకారం ఎంక్వైరీ చేయాలని సూరారం లోని పాత సొసైటీ బిల్డింగ్ రిపేర్ పేరుమీద అవినీతి జరుగుతుందని వారి దృష్టికి తీసుకుపోవడం జరిగింది ఇంతకుముందు రెండు నెలల క్రితం కూడా డిసిఓకు కలెక్టర్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది కానీ డిసిఓ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం రిజిస్ట్రేషన్ లేని బిల్డింగ్‌కు డబ్బులు మంజూరు చేయడం చైర్మన్ మరియు సీఈవో ఇద్దరు ఎరువులపై కమిషన్ 9:50 లక్షల రూపాయలు కలిసి అవినీతికి పాల్పడడం జరిగిందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది వెంటనే డిసిఓ ను పిలిచి మండలించిన కలెక్టర్ రిపోర్టు వెంటనే తీసుకోవాలని ఆదేశించడం జరిగింది.

ఐదు గ్రామపంచాయతీ ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి జరుగుతున్న అవినీతిని బయటపెట్టాలని ఈ సందర్భంగా డైరెక్టర్లు డిమాండ్ చేయడం జరిగింది

# అదృశ్యమైన వృద్ధురాలిని.. నాలుగు గంటల్లోపే ఛేదించిన పోలీసులు



**న్యాల్‌కల్, సెప్టెంబర్ 07, (జనంసాక్షి) :** తన కూతురి వద్దకు వెళ్తానని చెప్పి అదృశ్యమైన ఓ వృద్ధురాలిని కేవలం నాలుగు గంటల్లోపే ఆచూకీని గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు మండలంలోని హద్నూర్ పోలీసులు. హద్నూర్ ఎస్సై సుజిత్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బసంత పూర్ గ్రామానికి చెందిన వృద్ధురాలు అమినాబి (80) ఆదివారం ఉదయం మండలంలోని వడ్డీ గ్రామంలో ఉన్న తన కూతురి వద్దకు వెళ్తానని గ్రామం నుండి బయలుదేరింది. ఆదివారం ఉదయం నుండి కనిపించకపోవడంతో సోమవారం ఉదయం వృద్ధురాలి మనవడు తాహీర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును స్వీకరించిన స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించారు. అదృశ్యమైన వృద్ధురాలు అమినాబిని కేవలం నాలుగు గంటల్లోపే ఆచూకీని గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. స్థానిక ఎస్సై, పోలీసుల చొరవపట్ల కుటుంబీకులు సంతోషం వ్యక్తం చేశారు.

# హామీలు అమలు చేయకుంటే ప్రజలే బుద్ధి చెబుతారు

- ప్రజావాణిలో బీఆర్ఎస్ నాయకుల వినతి



**మునిపల్లి, సెప్టెంబర్ 7 (జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మునిపల్లి మండల ప్రజావాణిలో వినతి పత్రం సమర్పించారు. రాష్ట్ర నాయకుడు పైతర సాయికుమార్ ఆధ్వర్యంలో సర్పంచులు, నాయకులు ఎంపీడీవో శ్రీనివాస్, డీటీ తహసీల్దార్ ప్రదీప్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. హామీలను విస్మరించిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంతో పాటు హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ మండల ప్రధాన కార్యదర్శి శశికుమార్, సర్పంచులు ఇర్ఫాన్, దయానంద్, రమేష్, రాజు, మల్లేశం, సంగమేశ్వర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జడ్చర్ల 3వ వార్డులో తీరిన రోడ్డు సమస్య

- ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డికి కాలనీవాసుల కృతజ్ఞతలు



**జడ్చర్ల, సెప్టెంబర్ 7 (జనంసాక్షి):** మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు శ్రీ సత్యనారాయణ స్వామి కాలనీలో స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చొరవతో మూడ నిధులతో కాలనీ ప్రధాన రహదారి సిసి రోడ్డు నిర్మాణ పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. దీర్ఘకాలికంగా ఉన్న రోడ్డు సమస్య తీరడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ, ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు అనంత కిషన్ క్షేత్రస్థాయిలో ఉండి రోడ్డు నిర్మాణ పనులను దగ్గరుండి పరిశీలించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు ప్రభాకర్, విష్ణవ కుమార్, రవిశంకర్, బాల్ రెడ్డి, అర్జున్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఫీజుల బకాయిలపై బీజేపీ పోరుబాట

**ఉప్పునుంతల, (జనంసాక్షి):** విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.15 వేల కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు చేపట్టిన 'చలో అసెంబ్లీ' కార్యక్రమానికి వెళ్తున్న బీజేపీ, బీజేవైఎం నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. సోమవారం ఉప్పునుంతల మండల కేంద్రంలో పలువురు బీజేపీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టులతో తమ గొంతును అణచలేరని, విద్యార్థుల హక్కుల కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

అరెస్టయిన వారిలో బీజేపీ మండల అధ్యక్షుడు తొల మహేష్, జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి ఎళ్ల సురేందర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు శివశంకర్, బీజేవైఎం నాయకుడు రాజు, ఎల్లయ్య యాదవ్, పి.శేఖర్, శ్రీకాంత్, జగన్ తదితరులు ఉన్నారు.

# గ్రామ పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు



**న్యాల్‌కల్, సెప్టెంబర్ 07, (జనంసాక్షి):** మండలంలోని మిర్జాపూర్ (ఎన్) గ్రామ పంచాయతీ కార్యదర్శిపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని సోమవారం గ్రామానికి చెందిన పలువురు ఇన్చార్జి ఎంపీడీఓకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కార్యదర్శి విధుల పట్ల నిర్లక్ష్యం, ఇష్టారీతిగా హాజరవ్వడం, పలు రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం, వార్డు సభ్యులతో సమన్వయం కలిగి ఉండకపోవడం, తదితర అంశాలపై విచారణ చేపట్టి పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో రాజు, స్వప్న, జగదీశ్వర్, సువర్ణలు ఉన్నారు.

# అక్రమ రేషన్ బియ్యం పట్టివేత

- 6 క్వింటాళ్ల బియ్యం..ఆటో స్వాధీనం

**రాజోలి, సెప్టెంబర్ 7(జనంసాక్షి):** మండలంలోని మాన్‌దొడ్డి గ్రామంలో ప్రభుత్వం ప్రజలకు సరఫరా చేసిన పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఆటోను పోలీసులు పట్టుకున్నారు. సమాచారం మేరకు రాజోలి గ్రామ శివారులోని సుంకేసుల డ్యామ్ సమీపంలో ఎస్సై కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు.

ఈ సందర్భంగా అనుమానాస్పదంగా వెళ్తున్న ఆటోను తనిఖీ చేయగా అందులో 6 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. బియ్యంతో పాటు ఆటోను రాజోలి పోలీస్ స్టేషన్‌కు తరలించి, రాజుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### కాంగ్రెస్ ప్రభుత్వం
## ఎన్నికల హామీలను నెరవేర్చాలి




**జగదేవ్‌పూర్, సెప్టెంబర్ 7 (జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మండల బీఆర్ఎస్ నాయకులు సోమవారం జగదేవ్‌పూర్ ప్రజావాణిలో దరఖాస్తు సమర్పించారు. బీఆర్ఎస్ నాయకులు ఏ. యాదవరెడ్డి, ఆలేటి ఇంద్రసేనారెడ్డి, ఆర్. ఉపేందర్‌రెడ్డి, జంబుల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. ప్రభుత్వం ఏర్పడి 1,000 రోజులు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. వెంటనే హామీలు అమలు చేయకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మైనర్ బాలికపై అత్యాచారం..
## నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 7 (జనంసాక్షి):** నాలుగేళ్ల మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కావలి బాల్‌రాజ్ (24)కు సంగారెడ్డి ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి ఆర్. శ్రీలేఖ 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.10 వేల జరిమానా విధించారు. 2025 జూన్ 18న బాలికపై నిందితుడు లైంగిక దాడికి పాల్పడగా, తల్లి గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇంద్రకరణ్ పోలీసులు కేసు నమోదు చేసి, సాక్ష్యాలు, శాస్త్రీయ ఆధారాలతో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఆధారాలను పరిశీలించిన కోర్టు నిందితుడిని దోషిగా నిర్ధారించింది. జరిమానా చెల్లించకపోతే అదనంగా రెండు నెలల సాధారణ జైలు శిక్ష విధించింది. దర్యాప్తు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను ఎస్పీ అభినందించారు.

## స్పీకర్‌ను అవమానించిన
## ఎమ్మెల్సీ తాతా మధుపై చర్యలు తీసుకోవాలి

**చేర్యాల, సెప్టెంబర్ 07 (జనంసాక్షి):**



తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అసభ్య పదజాలంతో మాట్లాడటాన్ని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు దాసరి శ్రీకాంత్ తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిని అవమానించడం శాసనసభ, ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనన్నారు. రాజకీయ విభేదాలను ప్రజాస్వామ్య పద్ధతిలో వ్యక్తం చేయాలని, రాజ్యాంగ పదవుల గౌరవాన్ని దిగజార్చే హక్కు ఎవరికీ లేదన్నారు. దళిత నాయకుల పట్ల బీఆర్ఎస్ వైఖరి ఈ ఘటనతో మరోసారి బహిర్గతమైందని విమర్శించారు. స్పీకర్‌పై వ్యాఖ్యలు చేసిన తాతా మధుపై శాసనసభ నిబంధనల ప్రకారం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులు హద్దులు పాటించి రాజ్యాంగ విలువలను కాపాడాలని కోరారు.

## 420 హామీలు
## అమలు పై తహసీల్దార్ కి వినతి



**మల్దకల్ సెప్టెంబర్ 7 (జనంసాక్షి):** మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో 1000 రోజుల కాంగ్రెస్ వైఫల్య పాలనలోభాగంగా420 హామీలను అమలుపై,నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి బాసు హనుమంతు నాయుడు ఆదేశాల మేరకు సోమవారం మల్దకల్ మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రజావాణిలో 6 గ్యారంటీలు,420 హామీలను అమలు చేయాలని తహసిల్దార్ కి వినతి పత్రం సమర్పించి,నిరసన తెలిపారు.ఈ కార్యక్రమంలో పటేల్ జనార్ధన్ రెడ్డి, శేఖర్ నాయుడు, సత్యన్న వీరేష్,జర్జీ తిరుమల్,నాయకులు తదితరులు పాల్గున్నారు.

# ఖనిజాల లీజుల ద్వారా ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకోవాలి

- **అధికారులతో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**




**మెదక్ బ్యూరో,సెప్టెంబర్ 7 (జనంసాక్షి):** ఖనిజాల లీజుల ద్వారా రెవెన్యూ ఆదాయాన్ని గణనీయంగా పెంచేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయ వీడియో సమావేశ హాలులో అదనపు కలెక్టర్. నగేష్, రెవిన్యూ, మైనింగ్, భూముల కొలతల శాఖ, ఇరిగేషన్, అధికారులతో సమీక్షించారు.

**ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..** సున్నపురాయి, మాంగనీస్, ఇనుప ఖనిజం, లిథియం మొదలైన ఖనిజాలతో సహా ప్రధాన ఖనిజాల లీజులను కేవలం వేలం ద్వారా మాత్రమే కేటాయించాలని ఆదేశిస్తూ భారత ప్రభుత్వం 2015లో ఎంఎండిఆర్ చట్టాన్ని సవరించింది. దీనికి అనుగుణంగా, రాష్ట్ర ప్రభుత్వం కూడా జి.ఓ.ఎం.ఎస్.నెం.26, తేది.31.03.2022 ద్వారా, ముడి రాయి, రోడ్డు మెటల్, భవన నిర్మాణ రాయి, డోలమైట్ మొదలైన చిన్న ఖనిజాల క్వారీ లీజులను వేలం ఆధారంగా మంజూరు చేయడాన్ని తప్పనిసరి చేస్తూ తెలంగాణ మైనర్ మినరల్ కన్సెషన్ రూల్స్, 1966ను సవరించింది. అని వివరించారు.

రెవెన్యూఆదాయం తెచ్చిపెట్టే వనరులపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ, లక్ష్య సాధనలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించకుండా కట్టుదిట్టంగా పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

సున్నపురాయి, మాంగనీస్, ఇనుప ఖనిజం, లిథియం వంటి ప్రధాన ఖనిజాల లీజుల కేటాయింపును మరింత పారదర్శకంగా మార్చేందుకు ప్రభుత్వం కేవలం ఈ-వేలం ద్వారా మాత్రమే కేటాయించాలని స్పష్టం చేసింది. అని వివరించారు. ఖనిజ వనరుల దుర్వినియోగాన్ని అరికట్టడానికి మరియు ప్రభుత్వ ఆదాయాన్ని పెంచడానికి ఈ వేలం విధానాన్ని ఖచ్చితంగా అమలు చేస్తామన్నారు.

ఖనిజ బ్లాకుల గుర్తింపు, వేలం , అవసరమైన క్లియరెన్స్‌ల పర్యవేక్షణ అంతా ఒకే డిజిటల్ పోర్టల్ ద్వారా జరుగుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఏడి మైన్స్ నాగరాజు, ఏడి ల్యాండ్ సర్వే కిషన్ ,డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇరిగేషన్ రంజిత్ కుమార్, ఆర్డీవోలు, తాసిల్దారులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో ఇసుక అక్రమ రవాణాపై పోలీస్ దాడులు

- **రెండు ఇసుక ట్రాక్టర్‌లు, రెండు బోలెరో వాహనాలు సీజ్**





**కోహెడ, సెప్టెంబర్ 07 (జనంసాక్షి):** మండలంలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్ లను, రెండు బొలెరో వాహనాలను నమ్మదగిన సమాచారం మేరకు, కోహెడ పోలీసులు పోలీస్ స్టేషన్ పరిధిలోని తంగళ్ళపల్లి గ్రామం లో అలాగే వింజపల్లి గ్రామంలో అక్రమ ఇసుక రవాణాపై చేస్తున్న ఇసుక ట్రాక్టర్ ను కోహెడ పోలీస్ లు పట్టుకున్నారు . పోలీస్ లు తెలిపిన వివరాల ప్రకారం తేదీ 07 -09-2026 తంగళ్ళపల్లి, వింజపల్లి గ్రామ పరిధిలో గల గ్రామ మోయ తుమ్మెద వాగు నుండి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో తంగళ్ళపల్లి, వింజపల్లి గ్రామాల్లో అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా ట్రాక్టర్ లు, బోలెరో వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నిందితులు తరలిస్తున్న ఇసుకకు సంబంధించిన ఎటువంటి అధికారిక అనుమతులు వారి వద్ద లేవని పోలీసులు గుర్తించారు.

**స్వాధీనం చేసుకున్న వాహనము, వ్యక్తుల వివరాలు:**

ఏ 1. బిగుళ్ల నరేష్ తండ్రి . కిష్టయ్య 23 సంవత్సరాలు , కులము ఎస్సి (మాదిగ ), గ్రామం . తంగళ్లపల్లి , మహీంద్రా ట్రాక్టర్ బి నెం.టీ ఎస్ -36-టి -9094, ట్రైలర్ బి నెంబర్ .టి ఎస్ -36-టి 9093

ఏ 2. బుర్ర శ్రీకాంత్ తండ్రి . సాయిలు , వయసు 30, కులం గౌడ్ , గ్రామం . తంగళ్లపల్లి , ట్రాక్టర్ జాన్ డీర్ ట్రాక్టర్ బీ నెంబర్ . టి ఎస్ -02-ఈ యూ -4403, ట్రైలర్ బి నెంబర్ ఏ పి -36-ఎన్ -2982

ఏ 3. కొత్తూరి నరేష్ తండ్రి . పోచయ్య , వయసు 40 కులం ముదిరాజ్ , గ్రామం . తంగళ్లపల్లి, జాన్ డీర్ ట్రాక్టర్ బి .నెం . టి ఎస్ -02-ఈ యూ -4403, ట్రైలర్ బి నెంబర్ ఏ పి -36-ఎన్ -2982 ( డ్రైవరు)

4 గీకురు రమేష్ తండ్రి . బాలరాజ్ వయసు 34 సంవత్సరాలు , కులం ముదిరాజ్ , వృత్తి డ్రైవర్ , గ్రామం. వింజపల్లి , బొలెరో టీజీ -36-టి -2810. బొలెరో బి నెంబర్ టి జి -36-టి -2367

5. గీకురు అజయ్ తండ్రి . స్వామి , వయసు 33, కులం ముదిరాజ్ , వృత్తి డ్రైవర్ , గ్రామం . వింజపల్లి బొలెరో బి నెంబర్ టి జి -36-టి 2367

పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు, బోలెరో వాహనాలను కోహెడ పోలీస్ స్టేషన్‌కు తరలించి, నిందితులపై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్సై పుల్ల అభిలాష్ తెలిపారు. ఎవరైనా అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని అలాగే జైలు శిక్ష కూడా తప్పదని ఈ సందర్భంగా ఎస్ ఐ పి అభిలాష్ హెచ్చరించారు.

## ఆత్మకూరులో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా



**ఆత్మకూర్, సెప్టెంబర్ 7 (జనంసాక్షి):** బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై కాంగ్రెస్ ప్రభుత్వం దురుసుగా వ్యవహరించిందని ఆరోపిస్తూ ఆత్మకూర్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. 6 గ్యారంటీలు, 420 హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నల్ల టీషర్టులతో అసెంబ్లీకి వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అడ్డుకుని అరెస్టు చేయడాన్ని నాయకులు ఖండించారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం సరికాదన్నారు. మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన ధర్నాలో మండల అధ్యక్షుడు రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రజావాణిలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, మాజీ కౌన్సిలర్ మండల రామకృష్ణ, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్‌ను అవమానించడం ప్రజాస్వామ్యానికే అవమానం

**జడ్చర్ల, సెప్టెంబరు 7 (జనంసాక్షి):** శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అసభ్యకర పదజాలంతో వ్యాఖ్యానించడాన్ని జడ్చర్ల కాంగ్రెస్ నాయకులు సోమవారం తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగబద్ధమైన స్పీకర్ స్థానాన్ని అవమానించడం ప్రజాస్వామ్యానికే మచ్చ అని, సదరు సభ్యుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాదేపల్లి పిఏసిఎస్ చైర్మన్ పాలెం సుదర్శన్ గౌడ్ డిమాండ్ చేశారు. ఒక దళితుడు ఉన్నత స్థానంలో ఉండటం ఓర్వలేకనే బీఆర్ఎస్ నేతలు అహంకారంతో మాట్లాడుతున్నారని, సదరు ఎమ్మెల్సీని తక్షణమే అనర్హుడిగా ప్రకటించాలని టౌన్ మహిళా అధ్యక్షురాలు స్వప్న కోరారు. స్పీకర్‌కు బీఆర్ఎస్ నాయకులు బేషరతుగా క్షమాపణ చెప్పాలని, తాతా మధు తన పదవికి రాజీనామా చేయాలని ఎస్సీ విభాగం మండల అధ్యక్షుడు ఎడ్ల చెన్నకేశవులు హెచ్చరించారు.

## రాళ్లవాగు వద్ద మోటార్ల మాయం

- **రెండు 5 హెచ్‌పీ మోటార్లు చోరీ.. రూ.40 వేల నష్టం**

**గోపాలపేట, సెప్టెంబర్ 7 (జనంసాక్షి):** పోల్కేపహాడ్ గ్రామ శివారులోని రాళ్లవాగు వద్ద రెండు వ్యవసాయ మోటార్లు చోరీకి గురయ్యాయి. గ్రామానికి చెందిన మండ్ల కన్నారెడ్డి తన 14 ఎకరాల పొలానికి నీరందించేందుకు రాళ్లవాగు వద్ద 5 హెచ్‌పీ మోటార్‌ను ఏర్పాటు చేశారు. ఈ నెల 26న మధ్యాహ్నం మోటార్‌ను ఆఫ్ చేసి ఇంటికి వెళ్లారు. 27న మధ్యాహ్నం పొలానికి వెళ్లి చూడగా మోటార్ కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల పరిశీలించగా పక్క పొలానికి చెందిన గాడుదుల లింగస్వామికి చెందిన మరో 5 హెచ్‌పీ మోటార్ కూడా చోరీకి గురైనట్లు గుర్తించారు.

రెండు మోటార్ల విలువ సుమారు రూ.40 వేలు ఉంటుందని బాధితులు తెలిపారు. వ్యవసాయ పనులకు వినియోగించే మోటార్లు చోరీకి గురికావడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పొలాల్లో ఏర్పాటు చేసిన మోటార్లకు భద్రత లేకపోవడంతో చోరీలు జరుగుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. మోటార్ల చోరీపై బాధితులు గోపాలపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు గోపాలపేట ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చోరీకి పాల్పడిన వారిని గుర్తించేందుకు పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

# వారసత్వ ఆస్తుల వివాదాలకు చట్టబద్ధ పరిష్కారమే మార్గం

- రెవెన్యూ అధికారులు లేదా న్యాయస్థానాన్ని ఆశ్రయించాలి: ఎస్పీ సునిత రెడ్డి



వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 7 (జనంసాక్షి): వారసత్వ ఆస్తులు, భూములు, స్థలాలు, కుటుంబ ఆస్తుల పంపకాలపై తలెత్తే వివాదాలను చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా రెవెన్యూ అధికారులు లేదా న్యాయస్థానాన్ని ఆశ్రయించి పరిష్కరించుకోవాలని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి సూచించారు. భూ, ఆస్తి వివాదాల పేరుతో బెదిరింపులు, దౌర్జన్యాలు, బలవంతపు ఆక్రమణలు, దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఎస్పీ ప్రజల నుంచి 10 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వారసత్వ హక్కులు, భూముల వాటాలు, పట్టాలు, సరిహద్దులు, కుటుంబ ఆస్తుల పంపకాలపై తలెత్తే వివాదాలు సాధారణంగా సివిల్ స్వభావానికి సంబంధించినవని తెలిపారు. ఇలాంటి సమస్యల పరిష్కారానికి సంబంధిత రెవెన్యూ అధికారులను సంప్రదించాలని, అవసరమైతే న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని సూచించారు.

ఆస్తి తమదనే కారణంతో చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం, ఎదుటివారిని బెదిరించడం, దౌర్జన్యానికి పాల్పడటం లేదా బలవంతంగా భూమిని ఆక్రమించడం ద్వారా సమస్యలు పరిష్కారం కావని స్పష్టం చేశారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కుటుంబ సభ్యుల మధ్య వివాదాలు గొడవలు, దాడులు, నేరాలకు దారితీయకుండా సంయమనం పాటించాలని, సాధ్యమైనంత వరకు చర్చల ద్వారా సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు.

**ప్రజావాణిలో 10 ఫిర్యాదులు**

ప్రజావాణిలో అందిన 10 ఫిర్యాదుల్లో 7 భూ, ఆస్తి వివాదాలు, ఒకటి భార్యాభర్తల మధ్య వివాదం, రెండు పరస్పర గొడవలకు సంబంధించినవిగా ఉన్నాయి. ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా పరిశీలించి బాధితులకు చట్టపరిధిలో పరిష్కారం అందేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సిబ్బందిని ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా పోలీసుల దృష్టికి తీసుకువచ్చేందుకు ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

# ఆటో యూనియన్ 7 డిమాండ్లపై మంత్రి పొన్నం ప్రభాకర్‌తో చర్చలు

- సీఎంతో మాట్లాడి అధికారికంగా ప్రకటిస్తానని హామీ
- జేఏసీ నాయకులకు ఆటో కార్మికుల కృతజ్ఞతలు
- ఆటోవర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ మండల నాయకులు పాల సాయిలు



చేర్యాల, సెప్టెంబర్ 07(జనంసాక్షి): ఆటో కార్మిక సమస్యలను రవాణా శాఖ మంత్రి పొన్నం దృష్టికి తీసుకెళ్లి చర్చలు జరిపిన ఏఐటీయూసీ ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. వెంకట్, జేఏసీ నాయకులకు ఆకునూరు భారత్ ఆటో యూనియన్ అధ్యక్షులు పాల సాయిలు, ఉపాధ్యక్షులు మల్లమరి నవీన్ లు కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ తో ఏఐటీయూసీ, జేఏసీ నాయకులు సమావేశమయ్యారు.

ఈ సమావేశంలో సికింద్రాబాద్ జోన్ రాష్ట్ర రవాణా శాఖ అధికారులు, ఇతర ఉన్నతాధికారులు, జేఏసీ నాయకులు పాల్గొని చర్చలు జరిపారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. ఆటో యూనియన్ నాయకులు ఇచ్చిన 7 డిమాండ్ల పరిష్కారం కొరకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డితో మాట్లాడి అధికారికంగా ప్రకటిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. చర్చలను సఫలం చేసి హామీల అమలుకు మంత్రి దృష్టికి తీసుకెళ్లిన జేఏసీ నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ఆటోవర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ మండల నాయకులు పాల సాయిలు ఒక ప్రకటనలో తెలిపారు.

# ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి.. మాజీ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి



జడ్చర్ల, సెప్టెంబర్ 7 (జనంసాక్షి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల వేళ ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి డాక్టర్ సి. లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం జడ్చర్ల ఎంపిడివో కార్యాలయంలో ప్రజావాణి ద్వారా జడ్చర్ల తహసీల్దార్ నర్సింగ్‌రావు, ఎంపిడివో విజయ్ కుమార్‌లకు వినతిపత్రం అందజేశారు. అనంతరం అసెంబ్లీ వద్ద నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై పోలీసుల అరెస్టులను నిరసిస్తూ బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి జడ్చర్ల సిగ్నల్ గడ్డపై భారీ రాస్తారోకో నిర్వహించి, సీఎం దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ సి. లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల ముందు 100 రోజుల్లో నెరవేరుస్తామని చెప్పిన వాగ్దానాలను వెయ్యి రోజులైనా అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. అసెంబ్లీ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మహిళా ఎమ్మెల్యేలను, ప్రజాప్రతినిధులను పోలీసులు అవమానిస్తూ దౌర్జన్యానికి పాల్పడ్డారని మండిపడ్డారు. పార్లమెంటులో రాహుల్ గాంధీ టీ-షర్టులు ధరించి నిరసన తెలిపితే లేని అభ్యంతరం, తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు టీ-షర్టులు వేసుకొని హామీలను ప్రశ్నిస్తే కాంగ్రెస్ నాయకులు ఎందుకు భయపడుతున్నారని నిలదీశారు. ప్రజలకు సమాధానం చెప్పలేకే మాజీ సీఎం కేసీఆర్‌ను విమర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులను అడ్డుపెట్టుకొని ఎంత అణచివేతకు పాల్పడినా బీఆర్ఎస్ పార్టీ ప్రజాక్షేత్రంలో నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## హరీశ్‌రావు అరెస్టుకు
# నిరసనగా బీఆర్ఎస్ ధర్నా
### సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం



నంగునూరు, సెప్టెంబర్ 7 (జనంసాక్షి): మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అరెస్టు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీకి రాకుండా అడ్డుకోవడాన్ని నిరసిస్తూ నంగునూరు మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. మండల అధ్యక్షుడు లింగం గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎద్ద సోమిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కోల రమేష్‌గౌడ్ మాట్లాడుతూ ప్రతిపక్ష ఎమ్మెల్యేల అరెస్టు అణచివేత ధోరణికి నిదర్శనమన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళనను శాంతింపజేశారు. ట్రాఫిక్ అంతరాయాన్ని తొలగించారు. కార్యక్రమంలో రాగుల సారయ్య, జైపాల్‌రెడ్డి, బెదురు తిరుపతి, కిష్టారెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


## ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను
# నెరవేర్చాలంటూ బీఆర్ఎస్ నాయకుల ధర్నా



చేర్యాల, సెప్టెంబర్ 07 (జనంసాక్షి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేర్యాల అంబేద్కర్ విగ్రహం వద్ద జాతీయ రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పిలుపుతో చేపట్టిన ఎనిమిది రోజుల నిరసన కార్యక్రమాల్లో భాగంగా ఈ ఆందోళన చేపట్టారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీకి రాకుండా అడ్డుకుని అరెస్టు చేయడాన్ని నాయకులు ఖండించారు. వెయ్యి రోజుల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, కేసీఆర్ కిట్, రైతుబంధు, రైతుబీమా, పింఛన్ల వంటి పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. మాజీ సీఎం కేసీఆర్ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులతో పోలిస్తే ప్రస్తుత ప్రభుత్వం అభివృద్ధి చేయడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


## దళిత సమాజానికి
# ద్రోహం చేస్తున్న బీఆర్ఎస్‌ను తరిమికొట్టండి



చేర్యాల, సెప్టెంబర్ 07 (జనంసాక్షి): దళిత సమాజానికి ద్రోహం చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ, నాయకులను గ్రామాల్లో తరిమికొట్టాలని యువజన కాంగ్రెస్ మండల నాయకుడు, పోతిరెడ్డిపల్లి 10వ వార్డు సభ్యుడు లింగంపల్లి సురేష్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ నాయకులు చేసిన వ్యాఖ్యలు అవమానకరంగా ఉన్నాయని అన్నారు. దళితుడిని సీఎం చేస్తానని కేసీఆర్ హామీ ఇచ్చి మోసం చేశారని ఆరోపించారు. గతంలో భట్టి విక్రమార్కకు సీఎల్పీ పదవి దక్కకుండా ఎమ్మెల్యేలను లాక్కున్న చరిత్ర బీఆర్ఎస్‌దేనన్నారు. స్పీకర్‌పై తాతి మధు వ్యాఖ్యలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళితులు ఏకమై 'బీఆర్ఎస్ హటావో'.. తెలంగాణ బచావో' నినాదంతో ముందుకు సాగాలని కోరారు.

# విద్యుత్ స్తంభాన్ని ఆనుకొని స్లాబ్ నిర్మాణం

- ప్రజావాణిలో మాజీ కౌన్సిలర్ మహేష్ ఫిర్యాదు



జడ్చర్ల, సెప్టెంబర్ 7 (జనంసాక్షి): మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు రాజీవ్ నగర్ కాలనీలో విద్యుత్ స్తంభాన్ని ఆనుకొని ప్రమాదకరంగా ఇంటి స్లాబ్ నిర్మాణం చేపట్టడంపై సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బుక్క మహేష్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇంటి ప్రాంగణంలో విద్యుత్ స్తంభం అడ్డుగా ఉండటంతో పాటు, దానికి ఆనుకొని స్లాబ్ నిర్మాణం చేయడం వల్ల భవిష్యత్తులో తీవ్ర విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదకరంగా ఉన్న ఈ విద్యుత్ స్తంభాన్ని అక్కడి నుంచి తొలగించి, కాలనీవాసులకు రక్షణ కల్పించాలని కోరుతూ అధికారులకు విజ్ఞప్తి పత్రం సమర్పించారు. ఫిర్యాదుపై స్పందించిన విద్యుత్ శాఖ ఏఈ వెంకటయ్య సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రమాదం చోటుచేసుకోకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు బుక్క మహేష్ తెలిపారు.

# రైతులు తమ పంటల వివరాలు నమోదు చేసుకోవాలి..



సదాశివపేట సెప్టెంబర్ 7(జనంసాక్షి): ప్రభుత్వం ఇచ్చిన వరి విత్తనాలను రైతులు సాగు చేసి ప్రభుత్వం అందిస్తున్న రూ.500 బోనస్ రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో రమేష్ అన్నారు. సదాశివపేట మండలంలోని మాచిరెడ్డిపల్లి గ్రామంలో ప్రభుత్వం సూచించిన ఏడు రకాల సన్న వరి సాగుచేసిన రైతులకు ప్రభుత్వం రూ.500 బోనస్ అందిస్తున్న అంశంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏవో రమేష్ మాట్లాడుతూ.. ఈ వానాకాలంలో బిపిటి (5204) హెచ్ఎంటి సోనా, ఆర్ఎన్ఆర్ 15048(తెలంగాణ సోనా) కేఎన్ఎం 1638 జై శ్రీ రామ్ డబ్ల్యు జి ఎల్ 44(సిద్ధి) కేఎన్ఎం 7715 వంటి ఏడు సన్న రకాలు సాగుచేసిన రైతులు సెప్టెంబర్ 10వ తేదీ లోపు ఆన్లైన్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. డీలర్ వద్ద ప్రభుత్వం సూచించిన పై ఏడు రకాల వరి సన్న విత్తనాలు కొనుగోలు చేసి ఉంటే సంబంధిత డీలర్ ను సంప్రదించి తమ పేరును వెంటనే నమోదు చేసుకోవాలన్నారు. అలాగే సొంత విత్తనాలు, ఇతర మార్గాల ద్వారా సన్నారకం విత్తనాలు సేకరించి సాగు చేసిన రైతులు సంబంధిత ఏవో దగ్గర నమోదు చేయించుకుని ప్రభుత్వము అందిస్తున్న రూ.500 బోనస్ ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కలాలి మోహన్ గౌడ్, ఏఈఓ ప్రభు చరణ్, రైతులు పాల్గొన్నారు.

## పాపన్నపేటలో
# రేవంత్ ప్రభుత్వ వైఖరి నిరసిస్తూ



**పాపన్నపేట, సెప్టెంబర్ 7 (జనంసాక్షి):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజులైనా హామీలు మాత్రం అమలు కాలేదని భారాస నాయకులు విమర్శించారు. సోమవారం గులాబీ శ్రేణులు సామూహంగా వెళ్లి స్థానిక తహశీల్దార్ సతీష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్బంగా వారు మాట్లాడారు. వృద్ధులకు రూ. 4 వేల పింఛన్లు అందించాలని, రైతులకు భీమ సౌకర్యం కల్పించి,యూరియా సమస్యలు లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. భారాస మండలాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, నాయకులు గురుమూర్తి గౌడ్, జగన్, బాబాగౌడ్, కుబేరుడు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



**హత్నూర, సెప్టెంబర్ 7 (జనంసాక్షి):** అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంలో అధికార కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలమైందని బిఆర్ఎస్ పార్టీ హత్నూర మండల అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి విమర్శించారు. అధికార పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న విజయోత్సవాలను వ్యతిరేకిస్తూ మండల కేంద్రమైన హత్నూరలో సోమవారం సమరభేరి కార్యక్రమాన్ని నిర్వహించారు. నర్సాపూర్- జోగిపేట ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. హామీలను అమలు చేయడం చేతగాని రేవంత్ సర్కార్ ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ఉత్సవాల పేరిట కొత్త నాటకం ఆడుతుందని వారు దుయ్యబట్టారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఈనెల 15 వరకు
# పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవాలి

- **ఎంపీడీఓ వెంకటలక్ష్మమ్మ**



**శివ్వంపేట సెప్టెంబర్ 7 (జనంసాక్షి):** ఆసరా పెన్షన్ మంజూరు కోసం అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవడం కోసం ప్రభుత్వం ఈనెల 15 వరకు గడువు పెంచిందని శివ్వంపేట ఎంపీడీఓ వెంకట లక్ష్మమ్మ పేర్కొన్నారు. మండల కేంద్రమైన శివ్వంపేట ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడారు. వితంతు పెన్షన్ మంజూరు కోసం దరఖాస్తుదారులు తన భర్త మరణ ధ్రువీకరణపత్రం అలాగే ఆధార్ కార్డును జత చేయాలనీ, గీత కార్మికులు లైసెన్స్ కార్డు, చేనేత కార్మికులు తమ సొసైటీ ధ్రువీకరణ పత్రం, దివ్యాంగులు సదరం సర్టిఫికెట్, ఒంటరి మహిళలు తహసీల్దార్ నుండి ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డును దరఖాస్తు ఫారంతో పాటు ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 15 వరకు సమర్పించాలని ఆమె తెలిపారు.

# ఫ్రీ బస్సు... ప్రయాణికుల పాట్లు



**పుల్కల్,సెప్టెంబర్ 7(జనంసాక్షి):** మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి వచ్చినా.. సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలో ప్రయాణికుల కష్టాలు మాత్రం తప్పడం లేదు. వారం రోజులుగా పోచారం గ్రామానికి వెళ్లే బస్సు సర్వీసు అందుబాటులో లేకపోవడంతో మహిళలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు సింగూరు వైపు నడిచే బస్సుల్లో రద్దీ పెరిగి కిటకిటలాడుతున్నాయి.సీట్లు దొరకకపోవడంతో కొందరు మహిళలు ఫుట్ బోర్డుపై నిలబడి ప్రమాదకరంగా ప్రయాణించాల్సి వస్తోంది. వారం రోజులుగా సర్వీసు కరువు పుల్కల్ నుంచి పోచారం మీదుగా నడిచే బస్సు వారం రోజులుగా రావడం లేదని స్థానికులు చెబుతున్నారు. దీంతో గ్రామాలకు వెళ్లే మహిళలు, వృద్ధులు, విద్యార్థులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉచిత ప్రయాణ సౌకర్యం ఉన్నా.. బస్సు సర్వీసులు సక్రమంగా లేకపోవడంతో ఆ ప్రయోజనం అందడం లేదని అంటున్నారు.



సింగూరు బస్సులో రద్దీ: పోచారం సర్వీసు లేకపోవడంతో సింగూరు వైపు వెళ్లే బస్సులపై అదనపు భారం పడుతోంది. బస్సు రాగానే ప్రయాణికులు పెద్ద సంఖ్యలో ఎక్కుతుండటంతో లోపల నిలబడేందుకు కూడా చోటు లేకుండా పోతోంది.కొందరు మహిళలు ఫుట్‌బోర్డుపై నిలబడి ప్రయాణిస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి.

దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని తోటి ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించాలి: మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో బస్సు సర్వీసులను పెంచాలని స్థానికులు కోరుతున్నారు. వారం రోజులుగా నిలిచిపోయిన పోచారం బస్సును వెంటనే పునరుద్ధరించడంతో పాటు సింగూరు మార్గంలో అదనపు సర్వీసులు నడపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# అసెంబ్లీ వద్ద ఘటన ప్రజాస్వామ్యంలో చీకటి రోజు



**మెదక్ టౌన్, సెప్టెంబర్ 07 (జనంసాక్షి):** అసెంబ్లీ వద్ద జరిగిన ఘటన ప్రజాస్వామ్యంలో చీకటి రోజుగా మిగిలిపోతుందని మాజీ ఎమ్మెల్సీ శేరీ సుభాష్ రెడ్డి అన్నారు. మెదక్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ప్రభుత్వ తీరుపై తీవ్రంగా మండిపడ్డారు.

ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికీ ఉందని, ప్రజా సమస్యలపై మాట్లాడేందుకు అసెంబ్లీకి వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అడ్డుకోవడంతో పాటు వారిపై దాడి చేయడం దారుణమన్నారు. గతంలో ఎన్నడూ ఇలాంటి ఘటనలు జరగలేదని పేర్కొన్నారు.

ఎమ్మెల్యేలనే అసెంబ్లీకి రాకుండా అడ్డుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీకి రావాలని మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. అసెంబ్లీకి రావడం కంటే ప్రజాక్షేత్రంలో ప్రజలతో కలిసి ఉండి, వారి సమస్యలపై పోరాడుతామని తెలిపారు. త్వరలో పాలమూరు-రంగారెడ్డి, కాళేశ్వరం ప్రాజెక్టులను ప్రజలతో కలిసి సందర్శించి, ఆయా ప్రాజెక్టుల పరిస్థితిపై చర్చిస్తామని మాజీ ఎమ్మెల్సీ శేరీ సుభాష్ రెడ్డి వెల్లడించారు.

# నర్సాపూర్‌లో సీఎం దిష్టిబొమ్మ దహనం



**నర్సాపూర్, సెప్టెంబర్ 7 (జనంసాక్షి):** అసెంబ్లీ సమావేశాలకు నల్ల దుస్తులు ధరించి వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకోవడాన్ని నిరసిస్తూ నర్సాపూర్‌లో బీఆర్ఎస్ నాయకులు సోమవారం ఆందోళన చేపట్టారు. నర్సాపూర్ ఆర్టీసీ బస్టాండ్ ఎదుట నిర్వహించిన నిరసనలో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించినప్పటికీ, బీఆర్ఎస్ నాయకులు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ దుర్గాప్ప గారి అశోక్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు పంబల్ల బిక్షపతి, కౌన్సిలర్ బుల్లెట్ రాజు, సీనియర్ నాయకులు సత్యంగౌడ్, రాకేష్‌గౌడ్, నాగరాజుగౌడ్, రింగుల ప్రసాద్, శివకుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

## రూ.3.83 కోట్ల
# వ్యయంతో నూతన ఆర్‌డీఓ కార్యాలయం

- **జోగిపేటలో ఆర్‌డీఓ కార్యాలయానికి భూమిపూజ**
- **మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ**



**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 7 (జనంసాక్షి):** అందోల్-జోగిపేట మున్సిపల్ పరిధిలో రూ . 3.83 కోట్లతో నూతన ఆర్‌డీఓ కార్యాలయం, నివాస సముదాయాల నిర్మాణానికి సోమవారం భూమిపూజ నిర్వహించడం జరిగిందని మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు) పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ ఆదేశాల మేరకు జోగిపేట తహసీల్దార్ కార్యాలయం వెనుక ఉన్న ఖాళీ స్థలంలో మున్సిపల్ చైర్మన్ ఎస్. కృష్ణారెడ్డి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించడం జరిగిందన్నారు.

రూ.3.83 కోట్ల వ్యయంతో జీం1 అంతస్తులో ఆర్‌డీఓ కార్యాలయం, నివాస క్వార్టర్లను నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మధుకర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, ఆర్అండ్‌బీ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ సాక్షిగా మహిళా ఎమ్మెల్యేకు అవమానం.. ఖండించిన బీఆర్ఎస్



**కొల్చారం, సెప్టెంబర్ 07 (జనంసాక్షి):** అసెంబ్లీలో మహిళా ఎమ్మెల్యేల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు ఆందోళనకరంగా ఉందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. సోమవారం కొల్చారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మెదక్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డిని అవమానించి, చీర లాగిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు గౌరీ శంకర్, యువజన అధ్యక్షుడు కోనాపూర్ సంతోష్‌రావు, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు యాబన్నగారి రవితేజరెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ అరిగే రమేష్ తదితరుల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న ఎస్సై మహమ్మద్ మోహీనుద్దీన్ పోలీసులతో చేరుకుని ధర్నా విరమింపజేసేందుకు ప్రయత్నించగా, నాయకులతో కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. అనంతరం పోలీస్‌స్టేషన్ వద్ద కూడా ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1,000 రోజుల పాలన వైఫల్యాన్ని నిరసిస్తూ గన్‌పార్క్ నుంచి అసెంబ్లీకి నల్ల దుస్తులతో వెళ్లడంలో తప్పేముందని నాయకులు ప్రశ్నించారు. మహిళా ఎమ్మెల్యే పట్ల పోలీసులు అత్యుత్సాహంగా వ్యవహరించారని ఆరోపిస్తూ, ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి యోగ పోటీలకు గురుకుల విద్యార్థుల ఎంపిక




**చేర్యాల, సెప్టెంబర్ 07(జనంసాక్షి):** ఈ నెల 11వ తేదీన నిర్వహించబోయే రాష్ట్రస్థాయి యోగా పోటీలకు సిద్దిపేట జిల్లా చేర్యాల మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల నుండి ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ పోలోజు నరసింహ చారి ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం సిద్దిపేట జిల్లా కోటిలింగాలలో జరిగిన జిల్లా స్థాయి యోగాసనాలు పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు జిల్లా స్థాయిలో మొదటి బహుమతి కైవసం చేసుకుని, రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపిక అయ్యారని వారు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఎస్ వర్షితు, హర్షవర్ధన్, జస్వంత్, వైష్ణో ఆర్యన్, మనోజు, అభి ఉన్నారు. వీరిని ప్రిన్సిపల్ నరసింహ చారి, ఫిజికల్ డైరెక్టర్ ఈ. సురేషు, పి.ఈ.టి రేణుక అధ్యాపకులు, అభినందించారు.

## వాహనదారుల భద్రతకు ఎన్‌జీఎఫ్ 132 క్యూఆర్ స్టిక్కర్

• జిల్లా ఎస్పీ పంకజ్ పరితోష్ ఆవిష్కరించారు



సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 7 (జనంసాక్షి): వాహనదారుల భద్రత, అత్యవసర సమయాల్లో సులభమైన సమాచార మార్పిడి కోసం రూపొందించిన ఎన్‌జీఎఫ్ 132– సంపర్క్‌మీ బ్రోచర్, కార్డు, ద్విచక్ర వాహనాల క్యూఆర్ స్టిక్కర్‌ను సంగారెడ్డి జిల్లా ఎస్పీ పంకజ్ పరితోష్ ఆవిష్కరించారు. ఎన్‌జీఎఫ్ 132 క్యూఆర్ స్టిక్కర్ ద్వారా వాహన యజమాని వ్యక్తిగత మొబైల్ నంబర్‌ను బహిరంగంగా ప్రదర్శించకుండానే అవసరమైన సమయంలో సంప్రదించే అవకాశం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. నో పార్కింగ్, వాహనం తొలగింపు, అత్యవసర పరిస్థితుల్లో ఈ వ్యవస్థ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్లు, బైకులు, స్కూటర్లు, ఆటోలు తదితర వాహనాలకు ఈ క్యూఆర్ స్టిక్కర్‌ను వినియోగించవచ్చని, ఆధునిక సాంకేతికతతో సులభమైన, సురక్షితమైన సమాచార వ్యవస్థను అందించడమే దీని ప్రధాన లక్ష్యమని ఎన్‌జీఎఫ్ 132 ఆంధ్రప్రదేశ్, తెలంగాణ పంపిణీదారుల సిబ్బంది తెలిపారు.

## 420 హామీలు అమలు చేసే వరకు ప్రశ్నిస్తూనే ఉంటాం



గద్వాల్, సెప్టెంబర్ 7 (జనంసాక్షి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడిచినా ప్రజలకు ఇచ్చిన 420 హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ ఇన్‌చార్జి బాసు హనుమంతు నాయుడు విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు జిల్లా కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషాకు వినతిపత్రం అందజేశారు. ముందుగా కలెక్టరేట్ ఎదుట ఆరు గ్యారంటీలు, 420 హామీలు అమలు చేయాలని నినాదాలు చేశారు. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక విస్మరించిందని ఆరోపించారు. హామీలు అమలు చేసే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని, ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, మాజీ జడ్పీటీసీ బాసు శ్యామల, నాగర్‌దొడ్డి వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల్లో ఇచ్చిన హామీలు తుంగలో తొక్కిన కాంగ్రెస్

• పేట మాజీ ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి



నారాయణపేట, సెప్టెంబర్ 7 (జనంసాక్షి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందని నారాయణపేట మాజీ ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి, కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ విమర్శించారు. బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు సోమవారం కలెక్టరేట్ ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. 420 హామీలు, 13 డిక్లరేషన్లు, ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేశారని రాజేందర్‌రెడ్డి ఆరోపించారు. కేసీఆర్ హయాంలో పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే హామీలు, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థుల పెండింగ్ ఫీజులపై పోరాటం చేస్తే అరెస్టులా?

• బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్.రామచంద్రారెడ్డి



అయిజ, సెప్టెంబర్ 7 (జనంసాక్షి): ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్. రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్తున్న బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి అయిజ పోలీస్‌స్టేషన్‌కు తరలించడాన్ని ఆయన ఖండించారు. రాష్ట్రంలో 40 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన రూ.15 వేల కోట్ల బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని కోరారు. బకాయిలతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారని, విద్యార్థుల చదువులు ఆగిపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. బకాయిలు విడుదల చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు తెలుగు నరసింహ, మేడికొండ భీంసేన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# హామీలు ఎగ్గొట్టి.. మాటలు దంచుడు!

• అచ్చంపేటలో కాంగ్రెస్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది

• ఎమ్మెల్యే వంశీకృష్ణకు మాజీ ఎమ్మెల్యే మర్రి సవాల్



అచ్చంపేట, సెప్టెంబర్ 7(జనంసాక్షి): ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని బీఆర్ఎస్ నేతలు విమర్శించారు. హామీల అమలుపై ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణతో బహిరంగ చర్చకు సిద్ధమని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అచ్చంపేట సమన్వయకర్త మర్రి సవాల్ విసిరారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అచ్చంపేట మినీ ఎన్టీఆర్ స్టేడియం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సబ్‌స్టేషన్ ఎదుట నిరసన చేపట్టి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మర్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో కొన్ని మాత్రమే అమలు చేసి, మిగతా హామీలను విస్మరించిందని ఆరోపించారు. ఆడబిడ్డలకు తులం బంగారం ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. అచ్చంపేట అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్ని నిధులు కేటాయించారో, ఎన్ని ప్రాజెక్టులు తీసుకొచ్చారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే వంశీకృష్ణ అచ్చంపేట కోసం పోరాడి ఒక్క ప్రాజెక్టయినా సాధించారా? హామీల అమలుపై బహిరంగ చర్చకు సిద్ధమా? అని మర్రి ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని అన్నారు.

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు శ్రీకాంత్ భీమా మాట్లాడుతూ అచ్చంపేటలో కాంగ్రెస్ పార్టీకి కౌంట్‌డౌన్ ప్రారంభమైందన్నారు. ఆరు గ్యారంటీలు, 420 ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఎమ్మెల్యే హామీల అమలుపై ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి హామీల అమలుకు ఒత్తిడి తెస్తామని తెలిపారు. కార్యక్రమంలో మనోహర్, నరసింహాగౌడ్, తులసీరామ్‌తో పాటు వివిధ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శాంతియుతంగా వేడుక జరుపుకోవాలి

• మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్



పాపన్నపేట,సెప్టెంబర్ 7 (జనంసాక్షి): గ్రామాల్లో వినాయక చవితి నవరాత్రి ఉత్సవ వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. సోమవారం పాపన్నపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పీస్ మీటింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. మండప నిర్వాహకులు పోలీసుశాఖ అనుమతి తీసుకొని, విద్యుత్ అధికారుల సూచనలు పాటించాలన్నారు. నిమజ్జన వేళ నది జలాల వద్ద తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. అత్యవసర సమయాల్లో 112 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్,వివిధ గ్రామాల యువకులు పాల్గొన్నారు.

## 420 హామీలు అమలు చేయాలి

ప్రజావాణిలో బీఆర్ఎస్ నాయకుల వినతి



బాలానగర్, సెప్టెంబర్ 07 (జనంసాక్షి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలు, ఆరు గ్యారంటీలు, 13 డిక్లరేషన్లను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి, మాజీ గిరిజన కార్పొరేషన్ చైర్మన్ వాల్యానాయక్ ఆధ్వర్యంలో ప్రజావాణిలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వాల్యానాయక్ మాట్లాడుతూ వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పి వెయ్యి రోజులు గడిచినా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. మహిళలకు రూ.2,500, తులం బంగారం, రైతులకు రైతుభరోసా, పంట బోనస్, రైతుకూలీలకు రూ.12 వేలు, నిరుద్యోగ భృతి, విద్యాభరోసా, పెన్షన్లు, ఇందిరమ్మ ఇళ్లు తదితర హామీలు అమలు చేయాలని కోరారు. పెండింగ్ ఫీజులు చెల్లించాలని, గ్రామ పారిశుధ్య పనులు చేపట్టాలని, హామీలు అడిగిన వారిపై కేసులు పెట్టడం ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చెన్నార్‌రెడ్డి, వెంకటాచారి, బాలు నాయక్, గోపాల్‌రెడ్డి, జగన్ నాయక్, గుడిసెల యాదయ్య పాల్గొన్నారు.

## రాక్‌బాల్ పోటీలకు నర్సాపూర్‌లో శ్రీకారం



నర్సాపూర్, సెప్టెంబర్ 7 (జనంసాక్షి): నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ కళాశాలలో అజయ్ యాదవ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 10వ సీనియర్ నేషనల్, 7వ సీనియర్ మిక్స్‌డ్ నేషనల్ రాక్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజారెడ్డి, మెదక్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు, జాతీయస్థాయిలో ప్రతిభను చాటేందుకు పోటీలు దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ రాజు యాదవ్, వైస్ చైర్మన్ బుచ్చేష్ యాదవ్, బీజేపీ నేతలు, క్రీడాకారులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

## హామీలు అమలు చేయాలి.. లేదంటే ఉద్యమం ఉధృతం

కాంగ్రెస్ 1000 రోజుల పాలనపై బీఆర్ఎస్ నిరసన



వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 7 (జనంసాక్షి):కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు సోమవారం వనపర్తిలో పాదయాత్ర, నిరసన చేపట్టి అదనపు కలెక్టర్ భీమా నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఆరు గ్యారంటీలు, హామీలు, డిక్లరేషన్లను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు బంధు బకాయిలు, రుణమాఫీ, రైతుబీమా, 24 గంటల విద్యుత్, ఎరువుల సరఫరా, సాగునీరు, మహిళా పథకాలు అమలు చేయాలని కోరారు. నిరుద్యోగులకు భృతి, ఉద్యోగాలు, విద్యార్థులకు విద్యాభరోసా, పెండింగ్ ఫీజుల చెల్లింపు, పెన్షన్లు పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మెల్యేల అరెస్టును నిరసిస్తూ కలెక్టరేట్ ఎదుట మెరుపు ధర్నా నిర్వహించారు. అరెస్టు చేసిన ఎమ్మెల్యేలను విడుదల చేయాలని కోరారు. డిమాండ్లు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వాకిటి శ్రీధర్, పలుస రమేష్‌గౌడ్, నందిమల్ల అశోక్, గంధం పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## కరెంట్ కోతలపై రైతుల ధర్నా

- పంటకు నీరు కావాలి.. నీటికి కరెంట్ కావాలి



వనపర్తి రూరల్, సెప్టెంబర్ 07 (జనంసాక్షి): వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ రాజపేట, పెద్దతాండా గ్రామాల రైతులు రాజపేట సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. విద్యుత్ కోతలతో పంటలకు సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ సర్పంచ్ ఎం. జయరాములు నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని నినాదాలు చేశారు. పంటలు కీలక దశలో ఉన్నందున విద్యుత్ అంతరాయాలతో రైతులు నష్టపోతారని జయరాములు నాయక్ అన్నారు. హామీలు అమలు చేసి నిరంతర విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ కోతలతో ఇబ్బందులకు గురిచేస్తే ఊరుకోబోమని రైతులు హెచ్చరించారు.

## అభ్యర్థుల తరఫున కుటుంబ సభ్యులు పత్రాలు సమర్పించవచ్చు

### మ్యాపింగ్, హియరింగ్‌కు హాజరుకాలేని వారికి తదుపరి షెడ్యూల్‌లో అవకాశం: కలెక్టర్ ప్రియాంక



నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 7 (జనంసాక్షి): ఓటరు జాబితా సవరణలో భాగంగా చేపడుతున్న మ్యాపింగ్, విచారణ ప్రక్రియపై అభ్యర్థులు ఎలాంటి అపోహలకు గురికావాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ ప్రియాంక తెలిపారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె పలు సూచనలు చేశారు. అభ్యర్థి స్వయంగా హాజరు కాలేని పరిస్థితుల్లో వారి కుటుంబ సభ్యులు సంబంధిత ధ్రువపత్రాలతో హాజరై పత్రాలు సమర్పించవచ్చని తెలిపారు. అభ్యర్థికి సంబంధించిన 11 ఆమోదయోగ్యమైన ధ్రువపత్రాల్లో కేసు స్వభావాన్ని బట్టి అవసరమైన పత్రాలను సమర్పించాలని సూచించారు. వయస్సు, జన్మతేదీ, మ్యాపింగ్ లేదా ఇతర అంశాలకు సంబంధించి విచారణకు హాజరుకావాల్సి ఉంటే సంబంధిత పత్రాలతో తమ అభ్యర్థనను నమోదు చేసుకోవచ్చన్నారు.

నోటీసు అందజేసే సమయంలో లేదా ధ్రువపత్రాలు స్వీకరించే సమయంలో అభ్యర్థి లేదా వారి తరఫున హాజరైన కుటుంబ సభ్యుడి ఫొటోను అధికారులు అక్కడికక్కడే తీసుకుని రికార్డులో నమోదు చేస్తారని తెలిపారు. అభ్యర్థులు ప్రత్యేకంగా ఫొటో సమర్పించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఈ అంశాలను బీఎల్ఓలు తప్పనిసరిగా గుర్తుంచుకోవాలని ఆదేశించారు.

**హియరింగ్‌కు మరో అవకాశం...**

ఇప్పటికే నిర్ణయించిన షెడ్యూల్‌లో హియరింగ్‌కు హాజరుకాలేకపోయిన వారికి మరో అవకాశం కల్పిస్తామని కలెక్టర్ తెలిపారు. హాజరుకాని కేసులను గుర్తించి, తదుపరి షెడ్యూల్‌లో తిరిగి విచారణ నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. మ్యాపింగ్‌కు సంబంధించి పెద్ద సంఖ్యలో కేసులు పెండింగ్‌లో ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక తేదీలు నిర్ణయించి, అభ్యర్థులు లేదా వారి కుటుంబ సభ్యులు హాజరై అవసరమైన పత్రాలు సమర్పించేలా ఏర్పాట్లు చేస్తామని వివరించారు.

అభ్యర్థులు తమ పోలింగ్ స్టేషన్ నంబర్, తదుపరి విచారణ తేదీ తదితర వివరాలను సంబంధిత సూపర్‌వైజర్, బూత్ స్థాయి అధికారి లేదా ఇతర అధికారులను సంప్రదించి తెలుసుకోవాలని సూచించారు. హియరింగ్‌కు హాజరుకాలేకపోయిన వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తదుపరి షెడ్యూల్‌లో అవకాశం కల్పిస్తామని కలెక్టర్ ప్రియాంక స్పష్టం చేశారు. అర్హతను నిర్ధారించే సంబంధిత ధ్రువపత్రాలతో హాజరై ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## నాడు ఫ్రెండ్లీ పోలీసు.. నేడు రేవంత్ పోలీసు

### హామీల అమలు కోరితే కేసులు పెడతారా?: మాజీ ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి



నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 7 (జనంసాక్షి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను వెంటనే అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్. రాజేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర పిలుపు మేరకు సోమవారం యాద్గీర్ రోడ్డులోని తన నివాసం నుంచి కలెక్టరేట్ వరకు నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ ప్రియాంకకు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ హామీలను నమ్మి ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం అప్పగించారని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగులు, ఉద్యోగులు, పేదలు, వృద్ధులు, వికలాంగులు, రైతు కూలీలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని కోరారు. ప్రజల పక్షాన బీఆర్ఎస్ మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతుందని హెచ్చరించారు.

**హామీలు గుర్తుచేస్తే కేసులా?**

బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ పోలీసు వ్యవస్థను 'ఫ్రెండ్లీ పోలీసు'గా తీర్చిదిద్దితే, కాంగ్రెస్ పాలనలో 'రేవంత్ పోలీసు'గా మారిందని రాజేందర్‌రెడ్డి విమర్శించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించినా, హామీల అమలును కోరినా పోలీసులు జోక్యం చేసుకుని కేసులు నమోదు చేయడం ఏమిటని ప్రశ్నించారు. హామీలను టీషర్టులపై రాసుకుని అసెంబ్లీకి వచ్చిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. పోలీసు కేసులతో ప్రజల ప్రశ్నించే గొంతును అణచలేరని స్పష్టం చేశారు. ర్యాలీలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనానికి బీఆర్ఎస్ శ్రేణులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 8న చలో హైదరాబాద్‌కు ఆశా వర్కర్లు... ప్రజావాణిలో వినతి



ఆత్మకూర్, సెప్టెంబర్ 7 (జనంసాక్షి): సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 8న నిర్వహించే చలో హైదరాబాద్ కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు ఆత్మకూర్ మండల ఆశా కార్యకర్తలు తెలిపారు. సోమవారం ప్రజావాణిలో ఎంపీడీవో, మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రాలు అందజేశారు. రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఆరు నెలల పీఆర్సీ ఏరియర్లు, లెప్రసీ సర్వే, పల్స్ పోలియో, ఎన్నికల డ్యూటీ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్‌సీడీ ఆన్‌లైన్, ఏఎన్‌సీ, పీఎన్‌సీ టార్గెట్లు రద్దు చేయాలని కోరారు. ఆదివారాలు, పండుగలకు సెలవులు, క్యాజువల్, మెడికల్ సెలవులు, ఏఎన్ఎం, జీఎన్ఎం పోస్టుల్లో ప్రమోషన్ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూనియన్ మండల కార్యదర్శి ఎస్.రాజు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## విజయోత్సవాలు కాదు.. హామీల అమలుపై సమాధానం చెప్పాలి

- కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొత్త రవీందర్‌రావు విమర్శలు



ఉప్పునుంతల, (జనంసాక్షి): ఆరు గ్యారెంటీలు, 420 హామీలు పూర్తిగా అమలు చేయకుండానే కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల విజయోత్సవాలు నిర్వహించడం హాస్యాస్పదమని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొత్త రవీందర్‌రావు విమర్శించారు. అచ్చంపేటలో నిర్వహించిన విజయోత్సవ ర్యాలీపై ఆయన స్పందిస్తూ ఎన్నికల హామీలపై ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులకు పెట్టుబడి సాయం, కూలీలకు ఆర్థిక సాయం, ధాన్యానికి బోనస్, మహిళలకు రూ.2,500, ఫీజు రీయింబర్స్‌మెంట్, పెరిగిన పింఛన్లు, కల్యాణలక్ష్మి కింద తులం బంగారం, రూ.500 గ్యాస్ సిలిండర్ వంటి హామీల అమలుపై లెక్కలు వెల్లడించాలని కోరారు. ప్రజా సమస్యలను పక్కనపెట్టి విజయోత్సవాలకు ప్రాధాన్యం ఇవ్వడం సరికాదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, సర్పంచులు, యువకులు పాల్గొన్నారు.

## మహిళల ప్రయాణానికి మహాలక్ష్మి భరోసా

- మక్తల్ బస్టాండ్‌లో కాంగ్రెస్ శ్రేణుల విజయోత్సవ సంబరాలు
- ఆడపడుచుల ఆర్థిక భారం తగ్గింది
- మున్సిపల్ చైర్‌పర్సన్ వాకిటి మానస హనుమంతు



మక్తల్, సెప్టెంబర్ 07 (జనంసాక్షి): మహిళల సంక్షేమం, ఆర్థిక సాధికారతే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపిందని మక్తల్ మున్సిపల్ చైర్‌పర్సన్ వాకిటి మానస హనుమంతు అన్నారు. రాష్ట్ర మంత్రి, స్థానిక శాసనసభ్యులు వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు మక్తల్ పట్టణంలో

పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రవికుమార్ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ ప్రాంగణంలో మహిళా లబ్ధిదారులతో కలిసి విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ?ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం వల్ల విద్య, వైద్యం, ఉద్యోగం, చిరువ్యాపారాల నిమిత్తం వెళ్లే పేద, మధ్యతరగతి మహిళలకు నెలకు వేలాది రూపాయల ప్రయాణ ఖర్చులు ఆదా అవుతున్నాయని పేర్కొన్నారు. మహిళల స్వేచ్ఛాయుత రాకపోకలకు ఈ పథకం దోహదపడుతోందన్నారు. మహిళా సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తూ 2026-27 వార్షిక బడ్జెట్‌లో ఈ పథకానికి ఏకంగా రూ.4,305 కోట్లు కేటాయించడం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో, మంత్రి వాకిటి శ్రీహరి చొరవతో నియోజకవర్గంలోని ఆడపడుచులకు సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు.

?ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శ్రీనివాసులు, మహమ్మద్ ఫయాజ్, కౌన్సిలర్లు గోవిందరావు, కలాల్ శ్రీవిద్య, నాహిదా బేగం, మంజూర్ ఇలాహి, శంకర్, కో-ఆప్షన్ సభ్యులు శంషుద్దీన్, అస్లాముద్దీన్, వల్లంపల్లి లక్ష్మణ్, ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు అఫ్రోజ్, పలు గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### వరి బోనస్ పొందడానికి

## ఆన్లైన్ నమోదు చేయండి : డాకేశ్వర్ గౌడ్



వీపనగండ్ల, సెప్టెంబర్ 9 (జనంసాక్షి): వీపనగండ్ల మండల కేంద్రం తో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు పండించిన సన్న రకం ధాన్యాన్ని ఆన్లైన్లో నమోదు చేసుకుంటేనే ప్రభుత్వ నుండి బోనస్ వస్తుందని మండల వ్యవసాయ అధికారి డాకేశ్వర్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వానాకాలంలో రైతులు పండిస్తున్న సన్నరకం ధాన్యం ఆన్లైన్లో నమోదు చేసుకోవాలని అదేవిధంగా ప్రభుత్వం కేటాయించిన సన్న రకం ధాన్యానికి బోనస్ వస్తుందని తెలిపారు. అదేవిధంగా ఫర్టిలైజర్ షాప్ లో కొనుగోలు చేయకుండా స్వంతంగా పంట పండించిన రైతులు సొంతంగా ప్రకటించిన లేఖపత్రాను ఏఈఓ అధికారికి ఇవ్వాలని అన్నారు. రైతులు ఆలస్యం చేయకుండా ప్రభుత్వం ఇస్తున్న సన్న రకం ధాన్యానికి బోనస్ కోసం వెంటనే ఆన్లైన్ నమోదు చేసుకోవాలని అన్నారు.

# ఎమ్మెల్యేల అరెస్టు అప్రజాస్వామికం

- మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి
- మక్తల్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై ధర్నా.. చిట్టెం అరెస్ట్





**మక్తల్, సెప్టెంబర్ 07 (జనంసాక్షి):** అసెంబ్లీ సమావేశాలకు నల్లచొక్కాలతో శాంతియుతంగా వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ మక్తల్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద జాతీయ రహదారిపై సోమవారం చేపట్టిన ఆందోళనతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయి ఉద్రిక్తత నెలకొంది. నాయకులు, కార్యకర్తలు రహదారిపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.
ఈ సందర్భంగా చిట్టెం రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల వైఫల్యాలను ప్రశ్నించేందుకు వెళ్తున్న ప్రతిపక్ష ఎమ్మెల్యేలను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని విమర్శించారు. ప్రతిపక్ష గొంతును అణచివేసేందుకు అరెస్టులను ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజల తరఫున తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

**మహిళలకు రక్షణ కరువు...**



కాంగ్రెస్ పాలనలో మహిళలకు రక్షణ, గౌరవం కరువైందని చిట్టెం ఆరోపించారు. మహిళా ప్రజా ప్రతినిధులకు సైతం రక్షణ లేకుండా పోయిందన్నారు. మక్తల్‌లో ఇటీవల జరిగిన అత్యాచార ఘటనలో ఇద్దరిని మాత్రమే అరెస్టు చేసి, మిగతా ముగ్గురిని ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనలో శాంతిభద్రతలు క్షీణించాయని విమర్శించారు.

**ట్రాఫిక్ స్తంభన.. చిట్టెం అరెస్ట్...**

ధర్నాతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఆందోళన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని నర్వ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సమయంలో పోలీసు వాహనం వెంట కార్యకర్తలు పరుగులు తీయడంతో తోపులాట చోటు చేసుకుంది. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ గుప్తా, నరసింహగౌడ్, జుబేర్ పాషా, చిన్న హనుమంతు, గాల్‌రెడ్డి, రవితేజ, శ్రావణ్, అన్వర్, హుస్సేన్, అసిరెడ్డి, వెంకటేశ్, రామలింగం, శివా రెడ్డి, పాటు పలువురు పాల్గొన్నారు.

## కరెంటు కష్టాలపై బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా

**ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి**



**ఉర్కొండ, సెప్టెంబర్ 07 (జనంసాక్షి):**
మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై కరెంటు కష్టాలపై ఉర్కొండ బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం చేపట్టింది.
ఈ ధర్నా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం వల్ల రైతులు, ప్రజలు కరెంటు కోతలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. వ్యవసాయానికి సరైన కరెంటు ఇవ్వకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని విమర్శించారు. వెంటనే నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ,మండల నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## విద్యాశాఖ కార్యక్రమాల అమలులో వనపర్తి జిల్లా ముందంజలో ఉండాలి

**డిజిటల్ లెర్నింగ్, ఖాన్ అకాడమీ, సీఎన్‌డబ్ల్యూఎస్ఎన్, కంప్యూటర్ బోధనపై నిరంతర పర్యవేక్షణ అవసరం**



**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 7 (జనంసాక్షి):** విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో అమలవుతున్న వివిధ కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేసి వనపర్తిని రాష్ట్రస్థాయిలో ముందంజలో నిలపాలని జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య సూచించారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు, ఎంఐఎస్ కంప్యూటర్ ఆపరేటర్లు, ఐఈఆర్పీలు, ఐసీటీ బోధకులకు స్థానిక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా డీఈవో యాదయ్య మాట్లాడుతూ డిజిటల్ లెర్నింగ్, ఖాన్ అకాడమీ, సీఎన్‌డబ్ల్యూఎస్ఎన్ విద్యార్థులకు సంబంధించిన కార్యక్రమాలు, ఏఎక్స్ఎల్, కంప్యూటర్ బోధన తదితర అంశాల అమలుపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించాలని, కార్యక్రమాల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు.
చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ రాంబాబు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, బాలలపై వాటి ప్రభావాన్ని వివరించారు. బాల్య వివాహాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఈగల్ టీం ఎస్ఐ అంజద్ మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, విద్యార్థులపై వాటి ప్రభావంపై అవగాహన కల్పించారు.
సీఎంఓ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ విద్యాశాఖ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలు చేసి, సమస్యలను గుర్తించి పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో ప్లానింగ్ అధికారి శేఖర్, జీసీడీవో ఇందిరాదేవి, ఏఎస్‌వో నారాయణమ్మ, డీఎస్‌వో శ్రీనివాసులు, ఏపీవో శ్రీధర్‌రెడ్డి, సమగ్ర శిక్ష సిబ్బంది, సీఆర్పీలు, ఎంఐఎస్ ఆపరేటర్లు, ఐఈఆర్పీలు, ఐసీటీ బోధకులు పాల్గొన్నారు.

## క్రీడా మైదానానికి హద్దులు ఏర్పాటు చేయాలి

- క్రాంతి క్రీడా అసోసియేషన్ సభ్యుల వినతి




**ఖిల్లా ఘనపురం, సెప్టెంబర్ 08 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని సర్వే నంబర్ 39లో ఉన్న ఏడు ఎకరాల క్రీడా మైదానానికి హద్దులు ఏర్పాటు చేసి పరిరక్షించాలని క్రాంతి క్రీడా అసోసియేషన్ సభ్యులు కోరారు. ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఎంపీడీవో విజయసింహారెడ్డి, తహసీల్దార్ బి.సుగుణ సానుకూలంగా స్పందించి పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. 2012లో మరో నాలుగు ఎకరాలు కేటాయించడంతో మొత్తం ఏడు ఎకరాలు అందుబాటులోకి వచ్చాయని క్రీడాకారుడు దేవేందర్ తెలిపారు. మైదానాన్ని మినీ స్టేడియంగా అభివృద్ధి చేయాలని మండల అధ్యక్షుడు బుచ్చిబాబు గౌడ్ కోరారు. పోలీస్, ఆర్మీ తదితర ఉద్యోగాలకు సిద్ధమయ్యే యువతకు మైదానం ఉపయోగకరమని బీజేపీ మండల కార్యదర్శి గోపాల్ అన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## నూతన అంగన్వాడి బిల్డింగులు మంజూరుకై ఐసిడిఎస్ అధికారులకు వినతి



**మిడ్జిల్, సెప్టెంబరు 7 (జనంసాక్షి):** మండలంలోని మసిగుండ్లపల్లి గ్రామంలో అంగన్వాడి బిల్డింగ్ పాతది కావడంతో పాత బిల్డింగ్ స్థానంలో నూతన బిల్డింగ్ మంజూరుకై సోమవారం గ్రామ సర్పంచి గోద శ్రీశైలం ఆధ్వర్యంలో జడ్చర్ల ఐసిడిఎస్ ఆఫీసు దగ్గర అధికారులకు గ్రామ పంచాయతీ తీర్మానం అందజేశారు. ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పై అధికారులతో చర్చించి గ్రామంలోని నూతన అంగన్వాడీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించవలసిందిగా కోరారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని నూతన భవనానికి నిధులు మంజూరు చేయించి గ్రామాభివృద్ధిలో అధికారులు సహకరించాలని కోరారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్. దుబ్బ చెన్నయ్య. నాయకులు రమేష్ నాయక్ తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్‌కు షాక్.. బీఆర్ఎస్ గూటికి వార్డు సభ్యుడు

**మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సమక్షంలో శీలం లింగమయ్య చేరిక**



**ఉప్పునుంతల, సెప్టెంబర్ 7 (జనంసాక్షి):** ప్రభుత్వ వ్యవహార శైలి, గ్రామ పరిస్థితులపై అసంతృప్తితో కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన మామిళ్లపల్లి 6వ వార్డు సభ్యుడు శీలం లింగమయ్య బీఆర్ఎస్‌లో చేరారు. మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా లింగమయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థిగా గెలిచిన తాను గ్రామ అభివృద్ధి పనులపై ప్రశ్నించినందుకు తనపై దాడి చేశారని ఆరోపించారు. సర్పంచ్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ వార్డు సభ్యుల అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో విఫలమైందని విమర్శించారు. ప్రజలు మళ్లీ కేసీఆర్ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. తన పూర్తి ఇష్టంతోనే బీఆర్ఎస్‌లో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొత్త రవీందర్‌రావు, రామస్వామి గౌడ్, రాజాల్‌రావు, కడారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ నిరసన

**6 గ్యారంటీలు, 420 హామీలపై ప్రజావాణిలో ఫిర్యాదు**



**మిడ్జిల్, సెప్టెంబర్ 7 (జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ హయాంలో అమలు చేసిన రైతుబీమాను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందని, రైతులకు సరైన విద్యుత్ అందక ఇబ్బందులు పడుతున్నారని నాయకులు ఆరోపించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలను నిర్లక్ష్యం చేస్తూ పేదలను ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామని మండల అధ్యక్షుడు పాండు యాదవ్ అన్నారు. కార్యక్రమంలో జనార్దన్, సుదర్శన్, శశిరేఖ బాలు, చంద్రయ్యగౌడ్, శ్రీనివాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్టులపై గుమ్మడిదలలో నిరసన



**గుమ్మడిదల, సెప్టెంబర్ 7 (జనంసాక్షి):** అసెంబ్లీకి వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ గుమ్మడిదలలో బీఆర్ఎస్ నాయకులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఎమ్మెల్యేల పట్ల పోలీసులు దురుసుగా వ్యవహరించారని ఆరోపించారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పీఆర్సీ ప్రకటించే వరకు ఉద్యమం ఆగదు

**సెప్టెంబర్ 10న చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి: టీజీఈజేఏసీ**



**మాగనూర్, సెప్టెంబర్ 7 (జనంసాక్షి):** ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం పీఆర్సీ ప్రకటించే వరకు ఉద్యమం కొనసాగుతుందని టీజీఈజేఏసీ నారాయణపేట జిల్లా చైర్మన్ నరసింహారెడ్డి తెలిపారు. మాగనూరులో చలో హైదరాబాద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని వెంటనే ప్రకటించి అమలు చేయాలని, పెండింగ్ బిల్లులు, ఆరు డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ ఉద్యోగుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ప్రభుత్వం ఉద్యోగ సంఘాలతో చర్చించి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. సెప్టెంబర్ 10న నిర్వహించే చలో హైదరాబాద్‌కు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# తాతా మధును భర్తరఫ్ చేయాలి

**కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గంగేరి శ్రీహరి**



**సంగారెడ్డి, సెప్టెంబర్ 7 (జనంసాక్షి):** స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో సంగారెడ్డిలో నిరసన చేపట్టారు. తాతా మధును ఎమ్మెల్సీ పదవి నుంచి భర్తరఫ్ చేయాలని జిల్లా అధ్యక్షుడు గంగేరి శ్రీహరి డిమాండ్ చేశారు. ఐబీ చౌరస్తా, నెహ్రూ, రాజీవ్‌గాంధీ చౌక్‌ల వద్ద బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేసి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, తాతా మధు చిత్రాలతో కూడిన ఫ్లెక్సీలను దహనం చేశారు. స్పీకర్ రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్నారని, ఆయనను కించపరిచే వ్యాఖ్యలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని శ్రీహరి అన్నారు. తాతా మధుపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్నా ఘనుడు



**శివ్వంపేట, సెప్టెంబర్ 7 (జనంసాక్షి):** ప్రభుత్వ భూమిని మాజీ సర్పంచ్ పార్వతి భర్త రంగపల్లి సత్యం కబ్జా చేశారని శబాష్ పల్లి సర్పంచ్ అయ్యగారి యాదగిరి అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రమైన శివ్వంపేటలో విలేకరుల సమావేశంలో సర్పంచ్ యాదగిరి మాట్లాడుతూ మాజీ సర్పంచ్ పార్వతి హయాంలో శబాష్ పల్లి గ్రామ శివారులోని సర్వేనెంబర్ 261లో తూప్రాన్ - నర్సాపూర్ ప్రధాన రోడ్డు కు అనుకొని ఉన్న లక్షల రూపాయల విలువైన 6 గుంటల ప్రభుత్వ భూమిని అక్రమంగా కబ్జా చేశారన్నారు. ఈ కబ్జా విషయం పై జిల్లా కలెక్టర్ ను గ్రామస్థులతో కలిసి ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్ తెలిపారు. మాజీ సర్పంచ్ కుటుంబం చేసిన అక్రమ భూకబ్జా గురించి అధికారులకు ఫిర్యాదు చేయడంతోనే రంగపల్లి సత్యం మాపై కక్షగట్టి బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. నర్సాపూర్, తూప్రాన్ ప్రధాన రహదారిపై ఉన్న ప్రమాద సూచిక బోర్డులు కనబడక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్థులు, అలాగే ప్రయాణికులు తెలుపడం తో గ్రామ పంచాయతీ తీర్మానంతోనే అక్కడ కొన్ని పూల మొక్కలను తొలగించాల్సి వచ్చిందని ఆయన వివరించారు. ప్రజలకు సేవ చేయాలనే రాజకీయాలలోకి వచ్చామే తప్ప, మాజీ సర్పంచ్ భర్త వ్యవహరించినట్లు కేవలం సంపాదన పెంచుకోవడం కోసం కాదని ఆయన అన్నారు. ప్రభుత్వ భూమిని అక్రమంగా కబ్జా చేసిన వ్యక్తులపై తక్షణమే అధికారులు చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జోడు సత్యనారాయణ, పొనగారి వెంకటేష్, గంట నర్సిములు, జోడు దిలీప్, గుండె యాదగిరి, మస్కురి భాస్కర్, మార్తామాన్ మహేష్, పాలట యాదగిరి, కోదండ చారి, తదితరులు పాల్గొన్నారు.

# పేటలో బీజేపీ నాయకుల ముందస్తు అరెస్ట్.....




**పెద్ద శంకరంపేట, సెప్టెంబర్ 7 (జనంసాక్షి):** ప్రభుత్వం వెంటనే విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ చెల్లించాలని ఫీజుల బకాయి బిజెపి లడాయి పేరుతో బిజెపి రాష్ట్ర నాయకత్వం సోమవారం చలో అసెంబ్లీ పిలుపు ఇవ్వడంతో పెద్ద శంకరంపేట లో పోలీసులు బిజెపి నాయకులను ముందస్తు చేశారు.. పెద్ద శంకరంపేట మండల బిజెపి అధ్యక్షుడు శ్రావణ్ కుమార్. మండల బిజెవైఎం అధ్యక్షుడు బుగుదాల కృష్ణ.. ఎర్ర శ్రీహరి చందుపట్ల అనిల్ శంకర్రావు.. ధ్రువ కుమార్.. సాయిలు.. భూషణం.. సుకుమార్ ను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు.

# అసెంబ్లీకి రాకుండా ఉన్న కేసీఆర్ వెంటనే రాజీనామా చేయాలి

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి పూజల హరికృష్ణ
- సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్




**సిద్దిపేట బ్యూరో, సెప్టెంబర్ 07(జనంసాక్షి) :** అసెంబ్లీ ప్రారంభం రోజున సభ నడవకుండా చెయ్యాలని కుట్రలు కుతంత్రాలు పన్నాగం పన్ని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వ్యవహరించిన తీరు చూస్తే అచ్చం వీధి గుండాలుగా కంటే ఎక్కువగా రెచ్చిపోయారని సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గం ఇంచార్జ్ పూజల హరికృష్ణ ,పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. సిద్దిపేటలో సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ మాట్లాడుతూ.. అసెంబ్లీ మొదటిరోజున ప్రజలు చూస్తే ఏమని అనుకుంటారని, ఆలోచించకుండా కావాలని బిఆరెస్ ఎమ్మెల్యేలు అంగీలు తీసి అసెంబ్లీకి వచ్చి పరువుతీశారని అన్నారు. అలా రావద్దని పోలీసులు చెబితే పోలీసుల పై బిఆరెస్ ఎమ్మెల్యేలు వారిని నూకుక్కుంటూ దాడి చేశారు అని అన్నారు. మళ్లీ పోలీసులే మా మీద దాడి చేశారు అని అబద్దాలు మాట్లాడటం బిఆరెస్ ఎమ్మెల్యేలకు చెల్లిందని అన్నారు. అసెంబ్లీ బయట బిఆరెస్ ఎమ్మెల్యేలు స్పీకర్ గడ్డం ప్రసాద్ ను, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని దూషించడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. అధికారం పోవడంతో బిఆరెస్ ఎమ్మెల్యేలకు మతి భ్రమించింది అని వారిని వెంటనే మెంటల్ హాస్పిటల్ లో చేర్పించాలని అన్నారు. 10 సంవత్సరాలు ఏమ్మెల్యేలు మంత్రులుగా పనిచేసిన మీరు కనీసం సంస్కారం లేకుండా బరితెగింపు చేస్తున్నారని అన్నారు. 10 సంవత్సరాలు పాలన చేసిన కెసిఆర్ కు బిఆరెస్ పార్టీ నాయకులకు రాజ్యాంగం మీద గౌరవం లేదన్నారు. ఫామ్ హౌజ్ లోనే ఉంటున్న కెసిఆర్ చిల్లర రాజకీయాలు చెయ్యమని ట్రైనింగ్ ఇచ్చి అసెంబ్లీకి పంపినట్లుగా ఉంది అని అన్నారు. మీరు చేస్తున్న డ్రామాలు నాటకాలు జిమ్మిక్కులను చూసి మిమ్మల్ని చూసి తెలంగాణ ప్రజలు నవ్వుకుంటున్నారనిన్నారు. ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న కెసిఆర్ అసెంబ్లీకి రాకుండా కోట్ల రూపాయలు జీతం తీసుకుంటున్నారు అని అసెంబ్లీకి రాను అనుకున్నప్పుడు గజ్వేల్ ఎమ్మెల్యే పదవికి కెసిఆర్ వెంటనే రాజీనామా చేయాలి అని అన్నారు. మేము ఇష్టం వచ్చినట్లు చేస్తాం అని అడ్డుకుంటే పోలీసులపై దాడి చేయడం చట్టాని చేతుల్లో తీసుకున్నట్లే అవుతుందని వెంటనే బాధ్యులైన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ముద్దం లక్ష్మి, బొమ్మల యాదగిరి, దాస్ అంజయ్య, కలీముద్దీన్, మార్క్ పద్మ, కవిత, అంజిరెడ్డి, రాశాద్, వహాబ్, గాయాసుద్దీన్, విజయ్, డానియల్ సంతోష్ ఆజ్ఞ వంశీ, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# యూరియా సమాచారం ముందస్తుగా ఇవ్వాలి

**యాప్‌లతో రైతన్నకు తిప్పలు: సీపీఎం**




**బెజ్జంకి, సెప్టెంబర్ 7 (జనంసాక్షి):** రైతులకు యూరియా అందుబాటులో ఉంచి, ఎరువుల సరఫరా సమాచారాన్ని ముందస్తుగా తెలియజేయాలని సీపీఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఫర్టిలైజర్ సేల్ యాప్‌లో సాంకేతిక లోపాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, స్మార్ట్‌ఫోన్ లేని వారు, యాప్‌పై అవగాహన లేనివారు మరింత అవస్థలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఎరువుల నిల్వ వివరాలను ముందు రోజే రైతులకు తెలియజేయాలని కోరారు. యాప్ సమస్యలు పరిష్కరించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బొమ్మిడి సాయికృష్ణ, సంఘ ఎల్లయ్య, బోనగిరి లింగం తదితరులు పాల్గొన్నారు.

# డ్రైవర్ జైపాల్‌కు ఘన వీడ్కోలు



**కోహీర్, సెప్టెంబర్ 7 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కోహీర్ పోలీస్‌స్టేషన్ నుంచి సిద్దిపేటకు బదిలీపై వెళ్తున్న పోలీస్ డ్రైవర్ జైపాల్‌కు ఎస్ఐ నరేష్, పోలీస్ సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా జైపాల్‌ను శాలువా, పూలమాలతో సత్కరించారు.

ఈ సందర్భంగా ఎస్ఐ నరేష్ మాట్లాడుతూ.. కోహీర్ పోలీస్‌స్టేషన్‌లో జైపాల్ అందించిన సేవలు, విధి నిర్వహణలో చూపిన క్రమశిక్షణ, నిబద్ధత అభినందనీయమన్నారు. అత్యవసర సమయాల్లో వాహనాన్ని సురక్షితంగా నడుపుతూ సిబ్బందికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి అందించిన సహకారం మరువలేనిదని పేర్కొన్నారు.

తోటి పోలీస్ సిబ్బంది జైపాల్‌తో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ ఆయన ఆత్మీయ ప్రవర్తనను ప్రశంసించారు. నూతన బాధ్యతల్లో మరింత విజయవంతంగా రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం జైపాల్ తనను ఆదరించిన ఎస్ఐ నరేష్‌తో పాటు తోటి సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

# సునీతా రెడ్డి కీ అవమానంపై బీఆర్ఎస్ నిరసన

**రైతులకు కరెంటు ఇవ్వడం లేదు...**



**శివ్వంపేట, సెప్టెంబర్ 7 (జనంసాక్షి):** అడ్డగోలు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం చేతకావడం లేదని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రమణ గౌడ్ అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు, భాకికార్డులపై బీఆర్ఎస్ హైకమాండ్ పిలుపు మేరకు మండలం లోని అన్నీ గ్రామాల నుంచి తరలివచ్చిన బిఆర్ఎస్ నాయకులు, శ్రేణులు మండల కేంద్రమైన శివ్వంపేట లోని ఎంపీడీవో కార్యాలయం ముందు సోమవారం వంటవార్పు చేపట్టి భారీ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం హామీలను అమలు చేయాలనీ విజ్ఞప్తి చేస్తూ, శివ్వంపేట ప్రజావాణి లో ఎంపీడీవో దరఖాస్తు అందజేశారు. అక్కడి నుంచి శివ్వంపేట లోని తూప్రాన్ -నర్సాపూర్ ప్రధాన రోడ్డు పైకి చేరుకొని శాసనసభ సమావేశాలకు వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే లపై అలాగే నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి కీ జరిగిన అవమానాన్ని నిరసిస్తూ, మండల బిఆర్ఎస్ క్యాడర్ రోడ్డు కు అడ్డంగా పడుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు రమణ గౌడ్ మాట్లాడుతూ రైతులకు రైతు భరోసా, బీమా లేదు, కరెంట్ సరఫరా లేదు, యూరియా ఇవ్వడం లేదని, మహిళలకు నెలకు రూ. 2500, విద్యార్థులకు స్కూటీలు లేవని, సిగ్గులేకుండా మహిళ ఎమ్మెల్యే లను అవమానపర్చడం అత్యంత బాధాకరం అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ చంద్రాగౌడ్, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, మాజీ వైస్ ఎంపీపీ వాకిటి హన్మంత్ రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకులు పబ్బా రమేష్ గుప్తా, మహిపాల్ రెడ్డి, జేసీబీ నర్సింహా రెడ్డి, జేసీబీ మహేందర్ రెడ్డి, సర్పంచులు నారాయణరావు, బ్యాగరి నర్సయ్య, ఆకుల కుమార్, రాజేందర్ నాయక్, ఎం. లక్ష్మీనర్సయ్య, శ్రీశైలం యాదవ్, కృష్ణారావు, నరేందర్, నర్సింగ రావు, కన్నారం దుర్గేష్, నాగేశ్వర్ రావు, పాపయ్య చారి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర సరిహద్దు గ్రామాలే లక్ష్యంగా..!

**సరిహద్దు శివారు గ్రామాల్లో మాంసం వ్యర్థాల పరిశ్రమలు..!**

తెలంగాణ – కర్ణాటక సరిహద్దు, న్యాల్ కల్ మండలంలోని మల్గి, డప్పూర్ గ్రామాల శివారుల్లో గత కొన్ని సంవత్సరాలుగా మాంసం వ్యర్థాలతో పౌడర్, నూనె, తదితర తయారు ఎదేచ్ఛగా కొనసాగుతుంది. వ్యవసాయ పొలాల సమీపాన, అటవీ ప్రదేశాల్లో మాంసం వ్యర్థాలను ఎండ బెట్టడంతో వీధి కుక్కలు అధిక సంఖ్యలో వచ్చి మాంసం వ్యర్థాల ప్రదేశాలకు చేరుతున్నాయి. అటువైపుగా పంట పొలాలకు రాకపోకలు సాగించే రైతులు, కౌలు రైతులు, పశు పోషకులు, కూలీలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఒంటరిగా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మేకలపై శనకులు దాడి చేయడంతో మృత్యువాత పడ్డ ఘటనలు సైతం చోటు చేసుకున్నాయి. న్యాల్ కల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పలు గ్రామాల్లో తాజాగా ఇటీవల 25గురు వ్యక్తులపై వీధి కుక్కలు దాడి చేయడంతో స్థానిక వైద్యాధికారులు అవసరమైన టీకాలు వేసి పలువురికి బీదర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

న్యాల్‌కల్ మాంసం వ్యర్థాలతో విచ్చలవిడిగా వీధి కుక్కలు .....

గ్రామంలోని ప్రధాన కూడలీలు, మాణిక్ నగర్ కాలనీ, ఆర్టీసీ బస్టాండ్, పాఠశాల ఆవరణ, ఖురేషి కాలనీ, కస్తూర్బా గాంధీ గురుకులం, తదితర జనసంచార ప్రదేశాల్లో వందల సంఖ్యలో ఉన్న గ్రామ సింహాలతో గ్రామస్తులు గజ గజ వణికి పోతున్నారు. న్యాల్ కల్ – బీదర్, నారాయణఖేడ్, ముంగి, మిర్జాపూర్ (ఎన్) రోడ్ల ప్రక్కన, కల్వర్టులు, లోతట్టు ప్రదేశాల్లో.. మాంసం వ్యర్థాలు, ఆహార పదార్థాలు, చెత్తా చెదారాలను పార వేయడంతో అట్టి ప్రదేశాలు వీధి కుక్కలకు నివాస ప్రాంతాలుగా మారాయి. అటువైపుగా రాకపోకలు సాగించే జనాలు భయాందోళనకు గురవుతున్నారు.

**కుక్క కాటుకు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయి - స్థానిక వైద్యాధికారి డాక్టర్ జైన్ అమృత్ రాజ్**

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఇటీవల దాదాపు 25గురి వ్యక్తులపై వీధి కుక్కలు దాడి చేయడంతో అవసరమైన టీకాలు వేశాం. పందలాది పెంపుడు కుక్కలకు ఈ పాటికే టీకాలు వేశాం. వేల సంఖ్యలో వీధి కుక్కలు ఉన్నట్లు సమాచారం. వీధి కుక్కలు కాటు వేసి.. రక్తస్రావం అయితే "ఇమిన్ గ్లో బిలిన్" టీకా అందుబాటులో ఉంది. కుక్క దాడిలో వ్యక్తి శరీరంపై చిన్నపాటి రక్తస్రావం లేకుండా గీతలు పడితే.."రేబిస్ టీకా"ను అందిస్తున్నాం. ప్రస్తుతం వాసుపత్రిలో వీధికుక్కల బారినపడి తీవ్ర గాయాలైన వ్యక్తులకు అవసరమైన టీకాలు అందుబాటులో ఉన్నాయి. మెరుగైన చికిత్స కోసం సమీపంలోని బీదర్, జహీరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలిస్తున్నాం.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు.. డిసిసి అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి



**సదాశివపేట, సెప్టెంబర్ 7(జనంసాక్షి):** సంగారెడ్డి నియోజకవర్గంలోనీ అర్హులైన ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తుందని డిసిసి అధ్యక్షు రాలు నిర్మల జగ్గారెడ్డి అన్నారు. సోమవారం సదాశివపేట మండలంలోని ఇస్రాతాబాద్ గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశానికి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఒగ్గు శ్రీనివాస్,గ్రామ సర్పంచ్ బలరాం అనిత శ్రీనివాస్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మల్లికార్జున్ పటేల్, మాచిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ మోహన్ గౌడ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేలపై పోలీసుల దురుసు ప్రవర్తనకు నిరసన

**నర్సాపూర్‌లో సీఎం దిష్టిబొమ్మ దహనం**



**నర్సాపూర్, సెప్టెంబర్ 7(జనంసాక్షి):** అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పట్ల ప్రభుత్వం, పోలీసుల వ్యవహారశైలిని నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం నర్సాపూర్‌లో నిరసన చేపట్టారు. నర్సాపూర్ బస్టాండ్ సమీపంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పట్ల, ముఖ్యంగా నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డితో పాటు మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించడాన్ని నిరసిస్తూ నర్సాపూర్ మండల బీఆర్ఎస్ నాయకులు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.ప్రజాస్వామ్య పద్ధతిలో తమ నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం గౌరవించాలని, ఎమ్మెల్యేల పట్ల పోలీసులు మర్యాదగా వ్యవహ రించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బుల్లెట్ రాజు, మొహిజ్, మండల పార్టీ అధ్యక్షులు బోగ శేఖర్, పట్టణ అధ్యక్షుడు పంబల్ల బిక్షపతి, నాయకులు శివ కమార్,బాల్ రెడ్డి, సత్యం గౌడ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు అరెస్టులపై బీజేపీ నేతల ఆగ్రహం

**అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు**



**కోహీర్, సెప్టెంబర్ 7 (జనంసాక్షి):** ప్రజా సమస్యలపై శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం కాలరాస్తోందని బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'చలో ఇందిరాపార్క్' కార్యక్రమానికి వెళ్తున్న బీజేపీ నాయకులను కోహీర్ పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారిలో బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొల్ల కృష్ణయాదవ్, డిడిగి రాము ముదిరాజ్, నర్సింగ్ పవార్ ఉన్నారు. ప్రజా సమస్యలపై నిరసన తెలిపే హక్కు రాజ్యాంగం కల్పించిందని వారు అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు పోలీసులను ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. అరెస్టులతో తమ ఉద్యమాన్ని ఆపలేరని స్పష్టం చేశారు. నిర్బంధాలు నిలిపి ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.

## లక్ష్మీ రామిరెడ్డి ట్రస్ట్ సేవలు కొనసాగిస్తా: చిట్కుల మైపాల్‌రెడ్డి



**తూప్రాన్, సెప్టెంబర్ 7 (జనంసాక్షి):** తన తల్లిదండ్రుల పేరుతో ఏర్పాటు చేసిన లక్ష్మీ రామిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని రాష్ట్ర సర్పంచుల మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్కుల మైపాల్‌రెడ్డి తెలిపారు. తండ్రి రామ్‌రెడ్డి ఐదో వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి నివాళులర్పించి ట్రస్ట్ సేవలను ప్రారంభించారు. మనోహరాబాద్‌లో ప్రజల కోసం వైకుంఠ రథాన్ని అందించడంతో పాటు, అనారోగ్యంతో మృతిచెందిన వడియారం మహేష్ కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. పేద కుటుంబాలకు అండగా ఉంటానని, ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటానని మైపాల్‌రెడ్డి భరోసా ఇచ్చారు. వైకుంఠ రథాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణమూర్తి, ఎంపీవో శ్రీనివాస్, సంతోష్, వెంకటరెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వెయ్యి రోజులు.. ఎన్నో వాగ్దానాలు .. అమలు మాత్రం శూన్యం!

మహిళలు, నిరుద్యోగులు, ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందని అన్నారు. హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదని.. ప్రజలు, నిరుద్యోగులు, ఆటో కార్మికుల పక్షాన మరింత ఉధృతంగా పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.రూ.12 వేల జీవనభృతి, మహిళలకు రూ.2,500 సాయం, ఆటో కార్మికులకు రూ.12 వేల ఆర్థిక సాయం సహా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మాజీ చైర్మన్లు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, పట్టణ–మండల పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు, ఆటో డ్రైవర్లు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి

- **ఆయిల్‌పామ్ సాగుతో దీర్ఘకాలికంగా అధిక ఆదాయం**
- **మొక్కలు, డ్రిప్ పరికరాలకు 90 శాతం వరకు సబ్సిడీ**

**కొల్చారం, సెప్టెంబర్ 7 (జనంసాక్షి):** రైతులను ఆయిల్‌పామ్ సాగు వైపు ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, పంట సాగు ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు కొల్చారం మండలం తుక్కాపూర్ గ్రామంలో సోమవారం మెగా ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ దొడ్ల ఆంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆయిల్‌పామ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జిల్లాలోని వివిధ మండలాల్లో ఈ వారంలో మెగా ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తుండగా, అందులో భాగంగా కొల్చారం మండలంలో ఇప్పటివరకు 31 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ మొక్కలు నాటినట్లు అధికారులు తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుపై రైతులు ఆసక్తి చూపుతూ మెగా ప్లాంటేషన్ కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు.

ఈ సందర్భంగా డీహెచ్ఎస్ఓ ప్రతాప్‌సింగ్ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగు విధానం, పంట ద్వారా లభించే ప్రయోజనాలు, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, డ్రిప్ పరికరాలపై రాయితీలను రైతులకు వివరించారు. మొక్కలు, డ్రిప్ పరికరాలకు ప్రభుత్వం 90 శాతం వరకు రాయితీలు అందిస్తున్నట్లు తెలిపారు.

ఆయిల్‌పామ్ మొక్కలు నాటే రైతులకు మొదటి సంవత్సరంలో రూ.11,001 రాయితీ, అనంతరం నిర్వహణకు ప్రతి సంవత్సరం రూ.4,200 చొప్పున, మొత్తంగా రూ.16,800 వరకు రాయితీ రైతుల ఖాతాల్లో జమ చేస్తామని వివరించారు. అలాగే ఒక్కో రైతుకు గరిష్ఠంగా 12.50 ఎకరాల వరకు డ్రిప్ పరికరాలపై సబ్సిడీ కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఆయిల్‌పామ్ మొక్కలు నాటిన నాలుగు సంవత్సరాల అనంతరం ఎకరానికి 10 నుంచి 12 టన్నుల వరకు దిగుబడి పొందే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం ఒక టన్ను ఆయిల్‌పామ్ గెల ధర సుమారు రూ.24,025 ఉండటంతో ఎకరానికి సంవత్సరానికి సుమారు రూ.2.05 లక్షల వరకు ఆదాయం పొందే అవకాశం ఉందని, ఇతర ఖర్చులు పోను సుమారు రూ.1.50 లక్షల వరకు నికర ఆదాయం లభించే అవకాశం ఉందని అధికారులు వివరించారు.

కార్యక్రమంలో భాగంగా రైతు అడకులపల్లి దుర్గారాణి పొలంలో ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు. ఆమె ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి వ్యక్తం చేశారు.

ఆయిల్‌పామ్ సాగుతో దీర్ఘకాలికంగా మంచి ఆదాయం పొందే అవకాశం ఉన్నందున ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకుని సాగు చేపట్టాలని అధికారులు సూచించారు.

ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్ చారి, మండల వ్యవసాయ అధికారి శ్వేత కుమారి, మేనేజర్ కృష్ణారావు, మాజీ సర్పంచ్ శ్రీశైలం, ఉపసర్పంచ్ అరె రవీందర్, గ్రామ కార్యదర్శి ప్రశాంత్, అసిస్టెంట్ మేనేజర్ సూర్య, ఫీల్డ్ ఆఫీసర్లు మణిప్రకాష్, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమి ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

**ప్రజావాణిలో కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు**

**బెజ్జంకి, సెప్టెంబర్ 7 (జనంసాక్షి):** రేగులపల్లి గ్రామంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి కోళ్లఫామ్ నిర్మించారనే ఆరోపణలపై కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఎరుపుల బాలకిషన్ ప్రభుత్వ భూమిని ఆక్రమించారని ఆరోపిస్తూ, అధికారులు వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఆక్రమిత భూమిని ప్రజా ప్రయోజనాలకు వినియోగించాలని డిమాండ్ చేశారు. మండల స్థాయిలో ప్రజావాణి నిర్వహించడం ద్వారా స్థానిక సమస్యలను త్వరగా పరిష్కరించే అవకాశం ఏర్పడిందని శ్రీనివాస్ అన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఒగ్గ దామోదర్, కర్రావుల సందీప్, కత్తి రమేష్, రావుల నర్సయ్య, జెల్ల ప్రభాకర్, బోనగం రమేష్, పర్ష సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్య ఏదైనా ప్రజావాణికి రండి..!

**ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం: ఎంపీడీవో రమాదేవి**

**కోహీర్, సెప్టెంబర్ 7 (జనంసాక్షి):** ప్రజల సమస్యలను ఒకే వేదికపై పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రమాదేవి సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి ఐదు ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. దరఖాస్తులను సంబంధిత శాఖలకు పంపించి, క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైతే క్షేత్రస్థాయిలో విచారణ జరిపి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజలు సమస్యల కోసం కార్యాలయాల చుట్టూ తిరగకుండా ప్రజావాణిలో నేరుగా ఫిర్యాదు చేయవచ్చన్నారు.

ప్రతి సోమవారం నిర్వహించే కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.